DATE: 11-02-2022
prajamantalu, Jagitial
# ప్రజా మంటలు
తెలుగు జాతీయ దినపత్రిక
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
సంపుటి(Volume) : 2
సంచిక(Issue) : 230
పేజీలు - 10
వెల: రూ 5/-
prajamantalu.com
శుక్రవారం
11 ఫిబ్రవరి, 2022
tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,


ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు 5లో


ఈనెల 20 నుంచి నుమాయిష్ పునఃప్రారంభం 2లో

## ప్రధాని వ్యాఖ్యలపై సభాహక్కుల ఉల్లంఘన కింద
# నోటీసులు
### రాజ్యసభలో టీఆర్ఎస్ ప్రివిలేజ్ మోషన్
### పోడియం ముందు ఎంపీల నిరసన
### రాజ్యసభ నుంచి వాకౌట్

- రాజ్యాంగంపై గౌరవంతో తాము తీర్మానమిచ్చాం
- ప్రధానికి ఏమాత్రం ఇంగిత జ్ఞానం ఉన్నా క్షమాపణ చెప్పాలి
- తన మాటలని వెనక్కి తీసుకోవడం చేస్తారని ఆశిస్తున్నాం
- టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు
- సుదీర్ఘ ఉద్యమం, ప్రాణ త్యాగాల అనంతరం తెలంగాణ తెచ్చుకొన్నాం
- ప్రధాని వ్యాఖ్యలపై యావత్తు తెలంగాణ ప్రజలు ఎంతో బాధ పడుతున్నారు
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి ప్రధాని మోదీ రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై సభాహక్కుల ఉల్లంఘన కింద రాజ్యసభ సెక్రెటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. టీఆర్ఎస్ ఎంపీలు కె.కేశవరావు ఆధ్వర్యంలో రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. 187వ నిబంధన కింద టీఆర్ఎస్ ఎంపీలు కే కేశవరావు, సంతోష్, లింగయ్య యాదవ్, సురేశ్ రెడ్డి ఈ నోటీసు ఇచ్చారు. తెలంగాణ బిల్లుపై ప్రధాని అభ్యంతరకరంగా మాట్లాడారని అందులో పేర్కొన్నారు. తలుపులు మూసేసి తెలంగాణ బిల్లును ఆమోదింపజేశారని మాట్లాడటం రాజ్యాంగాన్ని అవమానించడమేనని నోటీసులో పేర్కొన్నారు. పార్లమెంటులో పాస్

- మిగతా 5లో



## యూపి తొలిదశలో
# 58.51 శాతం ఓటింగ్

- మందకొడిగా సాగిన ఓటింగ్
- యూపీలో ఓటర్ల పట్టుదల అభినందనీయమన్న మోడీ
- కిసాన్ యోజన నిరంతర లబ్ధితో బీజేపీకి ఓటాయాలని పిలుపు
- ఓటర్లంతా బయటకు వచ్చి ఓటేయాలన్న రాహుల్‌గాంధీ
- జయంత్ చౌదరి ఓటేయక పోవడంపై బీజేపీ విమర్శలు

**లక్నో,ఫిబ్రవరి10:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరగిన మొదటి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. కట్టుదిట్టమైన చర్యల మధ్య ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు కొనసాగిన పోలింగ్‌లో 58.51 శాతం ఓటింగ్ నమోదైనట్లు - మిగతా 2లో

## హిజాబ్, కండువాలకు
# దూరంగా ఉండండి

- తుది తీర్పు వచ్చే వరకు వాటి జోలికి వెళ్లొద్దు
- విద్యా సంస్థలను వెంటనే తెరవండి
- కర్నాటక హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

**బెంగళూరు,ఫిబ్రవరి10:** హిజాబ్ వివాదంపై కర్ణాటక హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. డ్రెస్ కోడ్‌పై ఎవరినీ బలవంతంచేయొద్దన్న న్యాయస్థానం.. ఈ సోమవారం నుంచి విద్యాసంస్థలు తెరచుకోవచ్చని కర్ణాటక

- మిగతా 2లో



### ఈటల రాజేందర్, రాజాసింగ్‌ల
# గృహనిర్బంధం
### జనగామ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

- ప్రభుత్వ నిరంకుశత్వం ఎక్కువ కాలం సాగదన్న ఈటల
- మేమేమన్న ఉగ్రవాదులమా అంటూ రాజాసింగ్ ప్రశ్న
- జనగామలో మరోమారు ఉద్రిక్తత
- బీజేపీ దీక్షలను అడ్డుకున్న పోలీసులు
- పోలీసుల తీరుపై మండిపడ్డ బీజేపీ నేతలు

5లో

## నేడు జనగామలో
# కేసీఆర్ పర్యటన
### కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసిన పోలీసులు
### సీఎం కేసీఆర్‌కు మంత్రుల ఘనంగా స్వాగత ఏర్పాట్లు



**జనగామ,ఫిబ్రవరి10:** ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. బీజేపీ నేతలను ముందస్తుగా అరెస్టులు చేశారు. టీఆర్ఎస్, బీజేపీ నాయకులు కొట్టుకున్న నేపథ్యంలో సీఎం పర్యటనకు బీజేపీ నాయకులు అడ్డుపడతారని ముందస్తుగా అరెస్టులు చేస్తున్నారు. జనగామలో మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్ పర్యటించిపరిస్థితిని పరిశీలించారు. ఏర్పాట్ల గురించి ఆరా తీసారు.మరి ఈ ఎపిసోడ్‌పై సీఎం కేసీఆర్ ఎలా స్పందిస్తారన్న ఉత్కంఠ నెలకొంది. అటు ఈ సభను జిల్లా మంత్రులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జనసమీకరణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ఇప్పటికే జనగామ అంతా - మిగతా 5లో

### రెండు వారాల్లోగా
## హాజరుకండి
విజయ్ మాల్యాకు చివరి వార్నింగ్ ఇచ్చిన సుప్రీం 2లో



## సీసీఐని పునరుద్ధరించాలి
- ఎమ్మెల్యే జోగు రామన్న డిమాండ్
- హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారి 44పై రాస్తారోకో

2లో



## ప్రజానాడి




### తెలంగాణపై బీజేపీకి కడుపునిండా
# విషమే
### ఎనిమిదేళ్ల తరవాత మోడీ మళ్లీ విషం కక్కారు

- ఆనాడు తల్లిని చంపి బిడ్డను కాపాడారని వ్యాఖ్య
- తెలంగాణ ద్రోహి బీజేపీని నిలదీయాల్సిందే
- హన్మకొండలో మంత్రి హరీష్‌రావు మండిపాటు



**వరంగల్,ఫిబ్రవరి10:** ప్రధాని మోదీ తెలంగాణపై అక్కసు వెళ్లగక్కుతున్నారని..దీనిని ప్రజలంతా ముక్తతకంఠంతో ఖండించాలని మంత్రి హరీస్ రావు అన్నారు. తెలంగాణ అమరులను మోదీ కించపర్చారన్నారు. తెలంగాణ త్యాగాలను, ఆకాంక్షను చిన్నగా చేసి చూస్తున్నారని మంత్రి అన్నారు. ఆరోజు తల్లిని చంపి బిడ్డను బతికించారని కామెంట్స్ చేశారని... మోదీ, బీజేపీ నాయకులు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. - మిగతా 2లో

### ప్రధానిమోడీ తెలంగాణను
# వ్యతిరేకించలేదు
### వ్యాఖ్యలను వక్రీక్రరిస్తున్న టీఆర్ఎస్ నేతలు

- బ్రేకింగ్ కోసమే ప్రివిలేజ్ మోషన్
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** ప్రధాన మంత్రి మోదీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎక్కడా కూడా వ్యతిరేకించలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ మరోమారు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ .. ఈరోజు బ్రేకింగ్, రేపు హెడ్ లైన్స్‌లో ఉండేందుకే టీఆర్ఎస్ ఎంపీలు ప్రధానిపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారని అన్నారు. తెలంగాణ బిల్లు సమయంలో కాంగ్రెస్ పెప్పర్ స్ప్రే కొట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఓటింగ్ సందర్భంగా విజయశాంతి పాల్గొంటే కేసీఆర్ ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. తెలంగాణ బిల్లు సమయంలో

- మిగతా 2లో

### హిజాబ్ వివాదంపై
# ఎమ్మెల్సీ "కవిత"



**హైదరాబాద్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** మహిళల వస్త్రధారణ విషయంలో ఎమ్మెల్సీ కవిత తన అభిప్రాయాలను కవిత రూపంలో కీలక వ్యాఖ్యలు చేశారు. వాటిని ట్విట్టర్లో పోస్టు చేశారు. స్త్రీలు సృష్టికర్తలు .. వారికి సొంతంగా నిర్ణయాలు తీసుకునే శక్తి ఉందన్నారు. ఈ సందర్భంగా తాను చేతితో రాసిన కవితను ట్విట్టర్ లో పోస్ట్ చేసారు..నుదుటున సింధూరం పెట్టుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛ అయినప్పుడు ... హిజాబ్ ధరించడం ముస్కాన్ వ్యక్తిగత స్వేచ్ఛ అవుతుందన్నారు. ఎలా ఉండాలి ? ఏం ధరించాలి? ఏం చేయాలి? అన్న విషయాలను మహిళల ఇష్టాఇష్టాలకే వదిలేయాలన్నారు. స్త్రీలు సృష్టికర్తలు అన్న

- మిగతా 2లో

# యూపి తొలిదశలో 58.51 శాతం ఓటింగ్

మొదటిపేజీ తరువాయి..

వారు పేర్కొన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి తక్కువ పోలింగ్ నమోదైందని అంటున్నారు. యూపీలో సగటున 60–70 శాతం పోలింగ్ నమోదు అవుతుంటుంది. కానీ గురువారం జరిగిన పోలింగ్‌లో తక్కువ ఓటింగ్ రికార్డ్ అయింది. మొదటి విడత పోలింగ్‌లో



రాష్ట్రంలోని 11 జిల్లాల్లోని 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఇదిలావుంటే ఉన్నావో సదర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున బరిలోకి దిగిన ఉన్నావో అత్యాచార బాధితురాలి తల్లి ఆశాసింగ్ విజయంపై ధీమా వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌పై విజయం సాధించిన ఆమె.. ఎన్నికల్లోనూ విజయం సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. తీవ్రమైన నేరాలకు బాధితులుగా మారిన వారికి న్యాయం అందించాలన్న ఉద్దేశంతోనే తాను ఎన్నికల బరిలోకి దిగినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అత్యాచార బాధితురాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తననే ఎన్నికల బరిలోకి దిగమన్నారని, కానీ పోటీ చేసేందుకు తన వయసు సహకరించకపోవడంతో టికెట్‌ను తన తల్లికి ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. న తల్లికి మద్దతుగా ఆమె కూడా ఎన్నికల్లో ప్రచారం చేశారు. ప్రజలు తమ బాధను అర్థం చేసుకుని అసెంబ్లీకి పంపిస్తారని భావిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై ప్రశ్నలు గుప్పించిన ఆశా సింగ్.. పరిస్థితులు మారితే తప్ప మహిళలపై నేరాలకు బ్రేక్ పడదని అన్నారు. కాగా, ఆశాసింగ్ ప్రత్యర్థులుగా బీజేపీ నుంచి పంకజ్ గుప్తా, సమాజ్‌వాదీ పార్టీ నుంచి అభినవ్ కుమార్‌లు బరిలో ఉన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలనే పట్టుదలతో చలిలో కూడా బయటకు వస్తున్న ఓటర్లను మోదీ ప్రశంసించారు. యూపీ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను సంక్షేమం కోసం దృఢ సంకల్పంగా అభివర్ణించారు. పీఎం కిసాన్ యోజన లబ్దిని నిరంతరం రైతులు పొందాలంటే ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడటం చాలా ముఖ్యమని చెప్పారు. చెరకు రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి తాము కృషి చేస్తున్నామన్నారు. చెరకును ఇథనాల్ ఉత్పత్తి కోసం కూడా వాడతామన్నారు. ఈ ఇథనాల్ నుంచి రూ.12,000 కోట్లు వచ్చిందని చెప్పారు. తొలిదశ పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. ఓటర్లంతా బయటికి వచ్చి, ఓట్లు వేయాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా దేశాన్ని అన్ని భయాల నుంచి విముక్తి చేయాలని తెలిపారు. ఇదిలావుండగా, ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి ఈ ఎన్నికల్లో ఓటు వేయడం లేదంటూ బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ నేత అమిత్ మాలవీయ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు జయంత్ చౌదరి వెళ్తున్నారని, తన ఓటు హక్కును వినియోగించుకోవడం లేదని, ఇది బాధ్యతాయుతమైన పనేనా? అని ప్రశ్నించారు. ఆయన పంపిస్తున్న సందేశం ఏమిటని అడిగారు. గెలుస్తామనే భావనను ఆయన ఇప్పటికే వదిలేసుకున్నారా? అని ప్రశ్నించారు. ఆయన తన ఓటును తానే వేయనపుడు, ఓటు వేయడానికి శ్రద్ధ చూపనపుడు, ఆర్ఎల్‌డీకి ఓటు వేయడం గురించి ప్రజలు ఎందుకు ఆలోచించాలని ప్రశ్నించారు. మూడు సాగు చట్టాల ప్రభావం ఓటింగ్‌పై ఉంటుందేమోనని బీజేపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు పెట్టుకుని అఖిలేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న జయంత్ ఈరోజు కూడా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఈ విషయమై ప్రశ్నించగా ఎన్నికల ప్రచారంలో ఉండడం తన ఓటు హక్కును ఇంకా వినియోగించుకోలేకపోయానని ఆయన చెప్పారు. అయితే ఈరోజు ఓటు వేసేందుకు ప్రయత్నిస్తానని ఆయన చెప్పడం కొసమెరుపు. ప్రజలను పోలింగ్ బూతులకు తరలాలని పిలుపునిచ్చే నేతలు సాధ్యమైతే ఓటు వేస్తామంటూ మాట్లాడటం ఏంటని జయంత్‌పై నెటిజెన్లు మండిపడుతున్నారు. ఓటు హక్కు వినియోగించుకోని వ్యక్తి ప్రజలను ఓ÷–లటెలా అడుగుతున్నారని జయంత్‌పై విపక్షాలు మండిపడుతున్నాయి.

# హిజాబ్, కండువాలకు దూరంగా ఉండండి

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మతపరమైన దుస్తుల కోసం పట్టుబట్టకూడదని తీర్పువచ్చేవరకు, క్లాస్ రూంలలో విద్యార్థులు హిజాబ్‌లు, కాషాయ కండువాలు ధరించవద్దని సూచించింది. కాగా ముస్లిం యువతులు పాఠశాలలు, కళాశాలల్లో హిజాబ్ ధరించడంపై కర్ణాటకలో వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారం కోర్టులో ఉండగా.. మరో వైపు ఇదే అంశంపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఇటీవల ముస్లిం మహిళలు హిజాబ్ ధరించడంపై అవగాహన కల్పించడానికి ఫిబ్రవరి 1న ప్రపంచ హిజాబ్ దినోత్సవాన్ని నిర్వహించారు. దీని తర్వాత హిజాబ్ వివాదం మరింత పెరిగింది. చాలామంది ముస్లిం మహిళలు హిజాబ్‌కు అనుకూలంగా ప్రదర్శనలు చేస్తున్నారు. కర్ణాటకలోని ఓ ప్రభుత్వ కళాశాలలో తరగతి గదిలో హిజాబ్ ధరించడాన్ని నిరాకరించడంతో హిజాబ్ వివాదం మొదలైంది. దీనిపై 8 మంది ముస్లిం విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. తరువాత చాలా కాలేజీల్లో ఈ వివాదం మొదలైంది. ఈమధ్య ఓ కాలేజీలో హిజాబ్ ధరించిన అమ్మాయిలను విడిగా కూర్చోబెట్టారు. ఈ విషయంపై నిరంతర నిరసనలు కొనసాగుతున్నాయి. హిజాబ్, కండువా వివాదం కారణంగా విద్యా సంస్థల మూసివేతపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యాసంస్థలు తెరవాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో తుది తీర్పు వచ్చే వరకూ విద్యార్థులు హిజాబ్–కండువాల ప్రస్తావన తేవొద్దని తెలిపింది. హిజాబ్ రగడపై దాఖలైన పిటిషన్‌ను సీజే జస్టిస్ రితురాజ్ అవస్థీ నేతృత్వంలోని హైకోర్టు విచారించింది. గురువారం విచారించిన ధర్మాసనం.. తుది తీర్పును ఈనెల 14వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకూ హిజాబ్– కండువాల ప్రస్తావనకు దూరంగా ఉండాలని పేర్కొంది.

## ఈనెల 20 నుంచి నుమాయిష్ పునఃప్రారంభం

హైదరాబాద్,ఫిబ్రవరి10: కరోనా కారణంగా వాయిదా పడ్డ నుమాయిష్‌ను ఈ నెల 20 నుంచి తిరిగి ప్రారంభించేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్ కొనసాగనుంది. ఇందుకోసం అన్ని శాఖల నుంచి అనుమతులు మంజూరైనట్లు తెలుస్తోంది. ఈమేరకు స్టాళ్ల నిర్వాహకులకు ఆహ్వానాలు పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒకవేళ స్టాళ్ల



నిర్వాహకులు సిద్ధంగా లేకపోతే ఫిబ్రవరి 25 నుంచి నుమాయిష్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల నుంచి అనుమతులపై రెండురోజుల్లో అధికారిక ప్రకటన వస్తుందన్నారు. కాగా జనవరి 1న గవర్నర్ తమిళిసై ప్రారంభించిన నుమాయిష్ మరుసటి రోజే కరోనా నిబంధనల కారణంగా మూతపడింది. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నుమాయిష్‌ను అర్థాంతరంగా అధికారులు నిలిపివేశారు. తాజాగా కోవిడ్ నిబంధనలు సడలించడంతో ఎగ్జిబిషన్ నిర్వహణపై ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు కీలక సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు కూడా పాల్గొన్నట్లు సమాచారం.

## ప్రధానిమోడీ తెలంగాణను వ్యతిరేకించలేదు

మొదటిపేజీ తరువాయి..

కేసీఆర్ హాజరుకాలేదనే అంశంపై తెలంగాణలో చర్చ జరుగుతోందని ఆయన అన్నారు. తెలంగాణ ఏర్పాటు కొరకు సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో గళమెత్తారన్నారు. బీజేపీని ఎదుర్కొనే దమ్ము టీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. రెండు రోజులు ఉందనగా సభను వాక్ ఔట్ చేశారని, గతంలో ధాన్యం కొనుగోలు అంశంలో టీఆర్ఎస్ సాధించింది ఏమీలేదని చెప్పారు. రాష్ట్రంలో అసలు కాంగ్రెస్ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. పన్నెండు వందల మంది బలిదానాలకు కారణం కాంగ్రెస్ అని ఆరోపించారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు బీజేపీ ఎప్పుడూ అనుకూలమే అని బండి సంజయ్ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కేసీఆర్ కించపరిచారని ఎంపీ అరవింద్ మండిపడ్డారు. రాజ్యాంగంపై నమ్మకం లేకపోతే కేసీఆర్ ముందు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీపై ప్రివిలేజ్ కాదు ముందు కేసీఆర్‌పై ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేయాలన్నారు. రాజ్యాంగాన్ని అవమానించిన కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ చంద్రుడు లాంటి వారని... ఆయనపై ఉమ్మి వేస్తే అది తిరిగి కేసీఆర్‌పైనే పడుతుందని వ్యాఖ్యలు చేశారు. ఆర్మూర్ నుంచి బీజేపీలోకి వచ్చిన నేతలకు స్వాగతం పలుకుతున్నామని... వీరి రాకతో వచ్చే ఎన్నికల్లో బీజేపీ బలోపేతం అవుతుందని ఎంపీ అరవింద్ ధీమా వ్యక్తం చేశారు.

## సీసీఐని పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే జోగు రామన్న డిమాండ్

హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారి 44పై రాస్తారోకో

ఆదిలాబాద్,ఫిబ్రవరి10:




ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఇండియా (సీసీఐ) యూనిట్‌లో మూతపడ్డ యూనిట్‌ను త్వరగా పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లోని మూతపడిన యూనిట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్–నాగ్‌పూర్ జాతీయ రహదారి 44పై గురువారం నిర్వహించిన రాస్తారోకోలో ఆయన పాల్గొన్నారు. యూనిట్ పునఃప్రారంభం కోసం పోరాడేందుకు ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎన్నికల సమయంలో సీసీఐని పునఃప్రారంభించేందుకు కృషి చేస్తానని చెప్పిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు గెలిచిన తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయారని రామన్న అన్నారు. సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.
యూనిట్ పునరుద్ధరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ దాదాపు 1200 మంది టీఆర్ఎస్ కార్యకర్తలు, జేఏసీ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## హిజాబ్ వివాదంపై ఎమ్మెల్సీ "కవిత"

మొదటిపేజీ తరువాయి..

కవిత...వారికి సొంతంగా నిర్ణయాలు తీసుకునే శక్తి ఉందన్నారు. ఈ సందర్భంగా తాను రాసిన కవితను ట్విట్టర్ లో పోస్ట్ చేసారు..




హిందూ–ముస్లిం–సిక్కు–క్రిస్టియన్..
మతమేదైనా సరే...
మనమంతా భారతీయులమే..
సిందూర్–టర్బన్–హిజాబ్–క్రాస్
ఏది ధరించినా మన గుర్తింపు భారతీయతే...
"త్రివర్ణ పతాకాన్ని" రూపొందించిన పింగళి వెంకయ్య అయినా..
"జై హింద్" అని నినదించిన అబిద్ హసన్ సఫ్రానీ అయినా..
"సారే జహాన్ సే అచ్చా హిందూస్తాన్ " అని ఎలుగెత్తి చాటిన
ముహమ్మద్ ఇక్బాల్ అయినా..
"జన గణ మన" తో జాతిని ఏకం చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్
అయినా..
మనకు చెప్పింది ఒక్కటే..
మనం ఎవరైనా... మనమంతా భారతీయులమనే.. !!

## దామాషా ప్రకారం బిసిలరు సీట్లు ఇవ్వాలి: విహెచ్

పెద్దపల్లి,ఫిబ్రవరి10: బీసీల దామాషా ప్రకారమే సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ.. ఓట్లు బీసీలవి.. రాజ్యాధికారం మాత్రం అగ్రవర్ణాలకే దక్కుతుందన్నారు. బీసీలు ఉన్న ప్రాంతాలలో బీసీలకే సీట్లు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ వల్లే సాధ్యమైందన్నారు. పార్లమెంటులో ప్రధాని మోదీ మాటలు అర్థం లేనివన్నారు. కాంగ్రెస్‌లో ఎవరికైనా సోనియా గాంధే టికెట్స్ ఇస్తారని వీహెచ్ పేర్కొన్నారు.

## తెలంగాణపై బీజేపీకి కడుపునిండా విషమే

మొదటిపేజీ తరువాయి..

వ్యవసాయ చట్టాల విషయంలో మూజువాణి ఓటుతో ఎలా బిల్ పాస్ చేశారని ప్రశ్నించారు. తెలంగాణ బిల్లుపై పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మథర్ మిల్క్ బ్యాంక్, టీబీ స్పెషాలిటీ క్లినిక్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, ఎంజీఎం ఆసుపత్రిలో 42 పడకల పీడియాట్రిక్ కేర్ యూనిట్ ను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణపై విషం కక్కిన మోడీ.. ఇప్పుడు వలస జీవులపై విషం కాక్కడు. మొన్న తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచారు. నేడు తెలంగాణ ఉద్యమ కారుల బలిదానాలను కించపరిచారు. తెలంగాణ ఏర్పాటును తక్కువ చేయడం అంటే? అమరులకు కించపరచడం..ఉద్యమాన్ని కించపరచడమే. వరంగల్ లోనే ఎంత మంది బలిదానాలు చూసాము..ఎన్ని త్యాగాలు..ఎన్ని శవాలు మోసాము. అప్పుడు తల్లిని చంపి బిడ్డను బతికించారు అన్నరు. ఇప్పుడు రాష్ట్ర ఏర్పాటు సక్రమంగా జరగలేదని



తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపినా కలుపుతారంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లయినా విభజన హామీలను పరిష్కరించకుండా తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోడీ విషం చిమ్ముతున్నారని హరీశ్ రావు మండి పడ్డారు. గురువారం హన్మకొండలో టి డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు కోసం శంకుస్థాపన చేయడంతో పాటు, అంటున్నారు. తెలంగాణపై ఎప్పుడు విషం చిమ్మడమే మోడీ పని. తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చింది. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వలేదు. 157 మెడికల్ కాలేజీ ఇస్తే ఎందుకు ఒక్కటి ఇవ్వలేదు. నవోదయ పాఠశాలలు, ఐఐఎం, ఐఐఐటీ, ఒక్కటి ఇవ్వలేదు. అన్నింటా తెలంగాణకు మొండి చేయి చూపారు. అందరూ వ్యతిరేకిస్తున్న కూడా వ్యవసాయ చట్టాలు ఎలా చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు. కరోనా సమయంలో ఎంతో మంది వలస జీవులు బతికి ఉంటే చాలు అనుకుంటే.. మోడీ వారిపై ఇష్టం ఉన్నట్లు మాట్లాడారు. వలస కార్మికులకు సమయం ఇవ్వలేదు. అకస్మాత్తుగా లాక్ డౌన్ పెట్టారు. ఎంతో మంది నరకం చూసారు. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ భోజనం పెట్టి, జేబులో డబ్బులు పెట్టీ, రైళ్లు ఏర్పాటు చేసి ఇళ్లకు పంపారు. ఇలా వలస కార్మికులకు అనేక మంది, సేవా సంస్థలు సహకారం అందించాయి. అందరినీ అభినందిచల్సినది పోయి.. మోడీ విమర్శలు చేస్తున్నారు. వారిని ఇంటికి పంపడం వల్లనే కరోనా పెరిగింది అని అవమాన పరిచారు. వలస జీవులపై ఎందుకు మోడీకి చిన్న చూపు. వలస కార్మికుల కష్టాలు అర్థం చేసుకోవడంలో కేంద్రం ఫెయిల్ అయ్యింది. మీరు ట్రంపును తీసుకు వచ్చి, మీటింగ్ లు పెడితే, ఎన్నికల ర్యాలీలు పెడితే కరోనా పెరగలేదు కానీ వలస కార్మికుల వల్ల పెరిగిందా. ఇంత కంటే దారుణం ఇంకొకటి ఉంటదా. పొట్ట చేత పట్టుకొని ఉన్న వారిపై నిందలు వేయడం కంటే సిగ్గుమాలిన చర్య ఇంకోటి ఉండదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అంటే భారతీయ జనతా పార్టీకి కడుపు నిండా విషం ఉంటుందన్నారు. బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లినయి అని పేర్కొన్నారు. నిధులు ఇవ్వకుండా సూటిపోటి మాటలు మాట్లాడటం సరికాద న్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రం పురోగతిలో ఉంటుంది.. అభివృద్ధి ఆగదు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. ఎంపీలు దత్తత తీసుకున్న గ్రామాల అభివృద్ధిలో టాప్ 10లో దేశంలో 7 తెలంగాణ గ్రామాలు ఉన్నాయి. వివిధ రంగాల్లో కేంద్రం నుండి అనేక అవార్డులు వచ్చాయి. ఇది మా పని తీరు.. కళ్లకు కనిపిస్తలేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మోదీ ఇంకో మాట అంటారు.. రాష్ట్రాలు, కేంద్రం కలిసి ఉండాలని.. నీతులు బాగానే చెబుతాడు. కానీ చేతల్లో మాత్రం చూపించరు అని విమర్శించారు. ఎందుకు మా ఏడు మండలాలు ఆదరాబాదరాగా ఆంధ్రాలో కలిపారు. ఎందుకు సీలేరు ప్రాజెక్టు అప్పగించారు. నువు చేస్తే ఒప్పు.. మేము చేస్తే తప్పా? అని హరీశ్‌రావు నిలదీశారు. మోదీ వ్యాఖ్యలను జర్నలిస్టు సంఘాలు కూడా తీవ్రంగా ఖండించాలి. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. మళ్లీ వారు ఇప్పుడు కూడా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## రెండు వారాల్లోగా హాజరుకండి

### విజయ్ మాల్యాకు చివరి వార్నింగ్ ఇచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10: బ్యాంకు రుణాల ఎగవేతదారు విజయ్ మాల్యాకు సుప్రీంకోర్టు చిట్ట చివరి అవకాశాన్ని ఇచ్చింది. వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ తన వాదనలను రెండు వారాల్లోగా వినిపించాలని చెప్పింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 24న జరుగుతుందని పేర్కొంది. తన వాదనలను వినిపించడంలో విఫలమైతే కోర్టు ధిక్కార నేరం క్రింద కేసును ఎదుర్కొనాలని తెలిపింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, బ్రిటన్‌లో ఏదో రహస్యంగా జరుగుతోందనేది భారత ప్రభుత్వ వాదన కాదని, ఏదో జరుగుతోందని, ఆ



సమాచారాన్ని పంచుకోవడం సాధ్యం కాదని బ్రిటన్ ప్రభుత్వమే భారత ప్రభుత్వానికి చెప్పిందని తెలిపారు.
÷ూల్యా దాదాపు రూ.9 వేల కోట్ల మేరకు బ్యాంకు రుణాలను ఎగవేసి, బ్రిటన్ వెళ్ళిపోయిన సంగతి తెలిసిందే. ఆయన 40 మిలియన్ డాలర్లను తన పిల్లలకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి ఈ లావాదేవీని జరిపారు. దీంతో ఆయన కోర్టు ధిక్కార నేరానికి పాల్పడినట్లు అత్యున్నత న్యాయస్థానం నిర్ధరించింది. ఆయన హాజరుకావాలని అనేకసార్లు ఆదేశించింది. ÷–రిటన్‌లోని అత్యున్నత న్యాయస్థానం విజయ్ మాల్యాను భారత దేశానికి అప్పగించాలని తీర్పు చెప్పిందని, అయితే ఆ దేశ ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. బ్రిటన్‌లో రహస్యంగా ఏం జరుగుతోందో తెలియదని చెప్పింది.

## మద్యం సీసాతో పొడిచి వ్యక్తి దారుణహత్య

నిజామాబాద్,ఫిబ్రవరి10: జిల్లాలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం సీసాతో పొడిచి దుండగులు కిరాతకంగా హతమార్చారు. ఈ సంఘటన జిల్లాలోని రెంజల్ మండలం బొర్గం శివారులో గురువారం చోటు చేసుకుంది. రెంజల్ మండల కేంద్రానికి చెందిన సాయికుమార్ (25) అనే వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా మద్యం సీసాతో గొంతులో పొడిచి చంపి.. మృతదేహాన్ని ముళ్ల పొదల్లో పడేశారు. హత్యకు గురైన వ్యక్తి బైక్, సెల్ ఫోన్ తీసుకుని పారిపోయారు. సాయికుమార్‌కు గత ఏడాది బాసర మండలం టాక్లి గ్రామానికి చెందిన అనితతో వివాహం జరిగింది. సంఘటన స్థలాన్ని బోధన్ రూరల్ సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ సాయన్న చేరుకొని మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించారు.



## జగిత్యాల కోర్టులో పార్కింగ్ స్థలం ప్రారంభం

**జగిత్యాల ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** జగిత్యాల లీగల్ జగిత్యాల కోర్టులో న్యాయవాదుల గాను వాహన పార్కింగ్ గురించి స్థలం ఆర్.డి.ఓ. 27 గుంటల స్థలం ఇవ్వడం జరిగింది. పార్కింగ్ స్థలం ప్రారంభోత్సవ మహోత్సవానికి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జిఎం ప్రియదర్శిని విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాండ్ర సురేందర్, జనరల్ సెక్రటరీ చంద్రమోహన్, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. తదుపరి జడ్జి ప్రియదర్శిని హైకోర్టు జడ్జిగా నియామకం అయినందుకు వారికి జగిత్యాల బార్ అసోసియేషన్ పక్షాన సన్మానం చేశారు.



కరీంనగర్ పట్టణ మార్కెట్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవానికి హాజరైన మేయర్ దంపతులు మేయర్ సునీల్ రావు, అపర్ణ రావులు





మాజీ కౌన్సిలర్ రేపల్లె హరికృష్ణ తండ్రి త్రిలోచన రావు మరణించగా, అదే విధంగా మున్సిపల్ రెవిన్యూ అధికారి తాండ్ర కిరణ్ రావు గుండె మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. వెంట ఉన్న కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్ తదితరులు

## వెంకటేశ్వర స్వామి కళ్యాణం లోక కళ్యాణం కొరకే

- మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్, ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** కరీంనగర్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు 7వ రోజు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి



లక్ష్మీనారాయణ స్వామి వారి కళ్యాణోత్సవం భక్త జనులను ఆద్యంతం అలరించింది. గోవింద నామాల నడుమ, వేద మంత్రోచ్చారణల సాక్షిగా స్వామి వారి కళ్యాణం కన్నుల పండువగా ఘనంగా జరిగింది. ఈ కళ్యాణోత్సవానికి స్థానిక మంత్రి గంగుల కమలాకర్ సతీసమేతంగా హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

## జనం కోసం జేఎస్ఆర్ అండ

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** మండలంలోని గట్లనర్సింగపూర్



గ్రామంలో మృతురాలి కుటుంబానికి బియ్యం టీమ్ జేఎస్ఆర్ ఆధ్వర్యంలో బియ్యం అందజేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన బూర సారమ్మ కుటుంబ సభ్యులను వృక్షప్రసాద దాత జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి మృతురాలి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గట్టు సది, మహిపాల్, మొండేడ్ల నారాయణ, కొంకిన భద్రయ్య, మంత్రి సన్ని, మంద రణదిప్, టీమ్ జేఎస్అర్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికై 29 డిమాండ్లతో సి.ఎం.కు సిపిఎం బహిరంగలేఖ

**జనగామ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** పోరాడి సాధించుకున్న జనగామ జిల్లా సమగ్రాభివృద్ధికి 29 ప్రధాన సమస్యలు పరిష్కారం జరగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కి రాసిన బహిరంగ లేఖ విడుదల చేశారు. గురువారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధికి 29 ప్రధాన సమస్యలతో కూడిన బహిరంగ లేఖ విడుదల చేసిన వివరాలు వివరించారు.

ఈ సందర్భంగా మోకు కనకారెడ్డి మాట్లాడుతూ... గత ఎన్నికల సందర్భంగా జనగామ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న జనగామ జిల్లా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉందని తెలిపారు. జిల్లా అభివృద్ధి పట్ల రాష్ట్రప్రభుత్వం జిల్లాకు చెందిన అధికారపార్టీ మంత్రి, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీని ఫలితంగా జిల్లా అన్ని రంగాలలో వెనుకబాటుకు గురవుతుందని విమర్శించారు. జనగామ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తానని మాటయిచ్చి మోసం చేశారని గుర్తుచేశారు. జిల్లాలో వ్యవసాయరంగానికి అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అలాగే కామోజీ టెక్స్ టైల్స్ పార్క్ పనులను ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయాలని, జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలో కుల, చేతి వృత్తిదారులు, ఇతర రంగాలలో పనిచేస్తున్న దినసరి కూలీలు, కార్మికులు చాలామంది ఉన్నారని వీరందరి ఆరోగ్య



భద్రతకై జిల్లాలో ఇఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో పాలకుర్తి, బమ్మెర పోతన, జఫర్గఢ్ కోట, ఖిలాషాపుర్ సర్వాయిపాపన్న కోటతో పాటు రిజర్వాయర్లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించాలని తెలిపారు. జిల్లాలో నర్సింగ్, పాల్ టెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేయాలని, జిల్లాలోని ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న అన్ని కేటగిరిలకు సంభందించిన పోస్టులను భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సిటీస్కానింగ్, స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి నిరుపేదలకు వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన విద్యాసదుపాయాలు అందుబాటులోకి తెచ్చి, పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు, మరియు మూడవ విడత ఇందిరమ్మ డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు సంబంధించిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జనగామ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఇచ్చిన హామీలను పరిష్కరించి అన్ని రంగాలలో జిల్లాను అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్రి అహల్య, బోట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, భూక్యా చందు నాయక్, ఎం.డి.అజారోద్దిన్, పట్టణ కమిటీ సభ్యులు బిట్ల గణేష్, బాల్నే వెంకట మల్లయ్య, దూసరి నాగరాజు, కల్యాణ లింగం, నాయకులు గంగరబోయిన మల్లేష్ రాజ్, బ్లేస్సింగ్టన్, మాలోతు గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన బండి సంజయ్ కృషి - రాష్ట్ర రహదారులకు మహర్దశ



## సీఆర్ఐఎఫ్ కింద రూ. 878.55 కోట్లు మంజూరు
## కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రూ.204 కోట్లు విడుదల

**కరీంనగర్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ కృషి ఫలించింది. తన పార్లమెంట్ పరిధిలోని రోడ్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలంటూ బండి సంజయ్ చేసిన విజ్ఞప్తి పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) కింద 2021-22 సంవత్సరానికి గాను తెలంగాణకు రూ. 878.55 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేస్తూ ఆ శాఖ జాతీయ కార్యదర్శి కమల్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం మంజూరైన నిధుల్లో దాదాపు రూ. 204 కోట్లు బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని రహదారుల నిర్మాణానికి కేటాయించడం విశేషం. వాస్తవానికి కేంద్రం నుండి రాష్ట్రానికి వివిధ శాఖల ద్వారా నిధులు రాబట్టేందుకు బండి సంజయ్ తీవ్రంగా యత్నిస్తున్నారు. సీఐఆర్ఎఫ్ కింద రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్రం తన విజప్తికి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంపట్ల బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఆ శాఖ ఉన్నతాధికారులకు బండి సంజయ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు రహదారుల నిర్మాణానికి ఆయా నిధుల్లోనుండి దాదాపు రూ.204 కోట్లు కేటాయించినట్లు బండి సంజయ్ ఈ సందర్భంగా తెలిపారు. నిధులు మంజూరు కావడంతో ఆయా పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. నిర్ణీత గడువులోగా రహదారుల నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పల్లెల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

## ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సారంగాపూర్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** సారంగాపూర్ మండల ఒడ్డెర కాలని గ్రామంలో పల్లె ప్రకృతి వనం,వైకుంఠ దామం, కంపోస్ట్ షెడ్డు ను ప్రారంభించి అనంతరం ఈజీఎస్ రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. అనంతరం లక్ష్మీదేవి పల్లి గ్రామంలో బీరయ్య దేవుని ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అందులో భాగంగానే పల్లెల్లో పట్టణాల్లో పర్కుల వలె పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, కంపోస్ట్ షెడ్డు ఏర్పాటు ద్వారా గ్రామాల్లో చెత్త నుండి ఎరువు తయారు చేసి ఆదాయం పొందవచ్చని ప్రతి గ్రామం ఉపయోగించుకోవాలని తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్ కు అందించాలని



అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు మంజూరు చేసి గ్రామాల్లో రహదారుల సమస్య లేకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. ప్రతి గ్రామానికి జనాభా ప్రాతిపదికన నెల నెలా నిధులు మంజూరు చేసి అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి అని అన్నారు. పట్టణాలు వదిలి నేడు పల్లెలకు ప్రజలు వస్తున్నారని దండగ అన్న వ్యవసాయం పండగలా చేసిన ఘనత మన ముఖ్యమంత్రిదని, కానీ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నేడు వ్యవసాయం పై నీలి నీడలు కమ్ముకున్నాయి అని కేంద్రం ధాన్యం కొనుగోలు లో అనేక ఇబ్బందులకు గురిచేస్తుంది అని ప్రజలు గమనించాలని,తెలంగాణ ఏర్పాటుపై కూడా ప్రధాని అనుచిత వ్యాఖ్యలు చేయడం విచారకర మని, తెలంగాణ పాలిట బీజేపీ శనిలా తయారైందని త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి, సర్పంచ్ పల్లపు వెంకటేష్, ఎంపీటీసీ మలేపు విమల, మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ నరసింహా రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, పాక్స్ వైస్ చైర్మన్ బాపిరాజు, ఉప సర్పంచ్ మాధవి, ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, ఎంపీటీసీ సుధాకర్, సర్పంచ్ లు జమున శ్రీనివాస్, రమేష్, రమణ రావు,ఢిల్లీ రామారావు, గ్రామ అధ్యక్షుడు చిన్న రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు వంశీ, నాయకులు తిరుపతి, ప్రేమానంధం, దామోదర్ రావు, చిట్ల రమణ, వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుడిపై దాడి అప్రజాస్వామికం

## ఎస్.ఐ.పై చర్యకు డిమాండ్

**జనగామ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** వికలాంగుడైన విద్యార్థి సంఘం నాయకుడు దడిగే సందీప్ పై అప్రజాస్వామికంగా దాడి చేసి వికలాంగులకు రాజకీయాలు అవసరమా అంటూ వికలాంగుల సమాజాన్ని అవహేళన చేసే విధంగా మాట్లాడి అవమానించిన ఎస్.ఐ వంశీకృష్ణ రాజ్యాంగం వ్రాసిన అంబేద్కర్ కంటే గొప్ప జ్ఞానివా?, అధికారపార్టీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తాబేదారువా అని ఎన్పిఆర్డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ల గణేష్ విమర్శించారు. గురువారం జనగామ పట్టణ కేంద్రంలోని జిల్లా ప్రజా సంఘాల కార్యాలయంలో ఎన్పిఆర్డి జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు పాముకుంట్ల చందు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ల గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ మెప్పుకోసం వకాల్తా పుచ్చుకొని నోటి దురుసుతో ఇష్టంమొచ్చినట్లు ఏది చేస్తే అది చెల్లుతుందనే పద్ధతిలో పోలీస్ అధికారని మరచి వీధి రౌడీలా, అధికారపార్టీ కార్యకర్తగా ప్రవర్తించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. తక్షణమే ఎస్.ఐ. వంశీకృష్ణపై వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేసి విధులనుండి తొలగించాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా వికలాంగులను సమీకరించి ఉద్యమిస్తామని అన్నారు. 2022 ఫిబ్రవరి 8న ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పాలకుర్తి కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని రాజ్యాంగబద్ధంగా శాంతియుతంగా ప్రజాస్వామ్యపద్ధతిలో ఆందోళన చేస్తున్న విద్యార్థులను, విద్యార్థి సంఘం నాయకులను పాలకుర్తి ఎస్.ఐ. కె. వంశీకృష్ణ భయభ్రాంతులకు గురి చేసేవిధంగా వీధి రౌడీలా వ్యవహరిస్తూ విద్యార్థి సంఘం నాయకుడు, వికలాంగుడు దడిగే సందీప్, మాలోత్ తరుణ్ నాయక్ లను నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ.... శారీరక వికలాంగుడని కూడా చూడకుండా కాలర్ పట్టుకొని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలిష్ వాహనంలోకి నెట్టి చెంపపై కొట్టి, శరీరంలోని ఇతర భాగాలపై పిడిగుద్దులు గుద్దుతూ, బూటు కాలుతో తన్నుతూ నీకు ఒక చెయ్యే పనిచేయదు రాజకీయాలెందుకురా అంటూ అవమానకరంగా చెయ్యొద్దని చెప్పడానికి వంశీకృష్ణ రాజ్యాంగం రచించిన అంబేద్కర్ కంటే గొప్ప జ్ఞానవంతుడా అని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా



విచక్షణ మరచి వీధి గుండాల ప్రవర్తించిన ఎస్.ఐ. వంశీకృష్ణపై జిల్లా ఉన్నతాధికారులు వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016 ప్రకారం కేసు నమోదుచేసి తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

పాలకుర్తి ప్రాంతం ఉద్యమాలకు కొత్తేమి కాదని, విస్నూరు దొరను గడగడలాడించిన చాకలి ఐలమ్మ వారసత్వంతో ఉన్ననేల పాలకుర్తని ఈసందర్భంగా గుర్తు చేశారు. ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వికలాంగులకు రాజకీయాలు పోలీసు ఉన్నతాధికారులకు అలాగే న్యాయ సేవా సమితి (లీగల్ సెల్ అథారిటీ), మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అలాగే పాలకుర్తి ఎస్.ఐ వంశీకృష్ణని విధుల నుంచి తొలగించే వరకు జిల్లా వ్యాప్తంగా వికలాంగుల ఆధ్వర్యంలో ఉద్యమాలు నడుపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాలోత్ రాజ్ కుమార్, రామకృష్ణ, బాల్దె స్వరూప, పరిశే పద్మ, రాపోలు రజిత, సాయి, ఎం.డి. అన్వర్, ఉప్పరి వేణు తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని గందరగోళంలోకి నెట్టిన మోడీ !

నాటి విభజన ప్రక్రియ ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పుట్టించింది. ఇది ఎవరూ కాదనలేని నిజం. ఇప్పటికీ నష్టం చేస్తున్నదని.. ఎపి ప్రజలు వాపోతున్నదీ కూడా నిజమే. అయితే మోదీ రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలను తెలుగుప్రజలు ఎవరు కూడా ఆమోదించడం లేదు. ఎందుకంటే సానుభూతి కన్నా సమస్యల పరిష్కారం ముఖ్యమన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. విభజన తరవాత ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు మానసికంగా స్థిరపడి పోయారు. ఎవరికి వారు బతుకుతున్నారు. ఈ స్థితిలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేలా ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు పుండుమీద కారం చల్లినట్లుగా ఉన్నాయి. కేంద్రం విభజన హామీలను నెరవేర్చడం లేదన్న మంటలో ఉన్న ప్రజలకు ఈ వ్యాఖ్యలు మరింత మంటరేపాయి. తెలంగాణ లో టిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు చూస్తే ప్రజలు ఎంతగగా కసిగా ఉన్నారో అర్థం చేసు కోవాలి. టిఆర్‌ఎస్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా మోడీ వ్యతిరేక ఆందోళనలు మిన్నంటాయి. మోడీ తీరుపై తీవ్ర నిరసనలు వ్యక్తం అయ్యాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మోడీపై విమర్శల దాడికి పూనుకున్నాయి. తిరుపతి పుణ్యక్షేత్రంలో మోదీ ఎన్నికల ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని ప్రమాణం చేసినా నెరవేర్చ లేదు. సరికాదా రకరకాల విన్యాసాలు చేశారు. కడప ఉక్కు సంగతి పక్కన పెడితే ఉన్న విశాఖ ఉక్కును తుక్కుగా అమ్మడానికి సిద్ధం అయ్యారు. ఇది నిజంగానే ప్రజలకు ఆగ్రహం తెప్పించే విషయం. ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బకొట్టడమే. అమరావతి ఉద్యమం సాగుతున్న వేళ వారికి కనీస స్వాంతన చేకూర్చే ప్రయత్నం చేయలేదు. ఈ క్రమంలో మోదీవ్యాఖ్యలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిజెపిని ఆత్మరక్షణలోకి నెట్టివేశాయి. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో టిఆర్‌ఎస్ ఎంతో దూకుడుగా వెంటనే నిరసనలకు పిలుపునిచ్చింది. తెలంగాణలో క్రమంగా బలపడుతున్న స్థితిలో రాష్ట్ర విభజనకు బీజేపీ వ్యతిరేకమన్న సందేశం..అదీ మోడీ ద్వారా రావడంతో ఇప్పుడు బిజెపి నేతలు తలలు పట్టుకుంటున్నారు. మోడీ వ్యాఖ్యలు ఓ రకంగా కెసిఆర్‌కు టిఆర్‌ఎస్‌కు బలాన్ని ఇచ్చాయనే చెప్పాలి. కాంగ్రెస్‌ను తిట్టాలనుకునే క్రమంలో ఆయన సొంతపార్టీ ప్రయోజనాలను పణంగా పెట్టారా అన్న భావన కలుగుతోంది. ఇకపోతే నోట్ల రద్దు, జివిస్టీ, కరోనా తరవాత పేదలు, దనవంతుల మధ్య అంతర్యం బాగా పెరిగింది. రెండు ఇండియాలు అంటూ సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రజలు కూడా ఆలోచన చేస్తున్నారు. మోదీ ఆదానీ,అంబానీ లాంటి వారికి మాత్రమే అండగా ఉంటున్నారన్న భావన ప్రజల్లో బాగా బలపడిపోయింది. పేదలను నిరుపేదలుగా మార్చేస్తున్నారన్న విమర్శలకు మీడియా ద్వారా బాగా ప్రాచుర్యం వస్తోంది. పలు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టడం, వాటిని సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేయడం..నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి వారిని దేశం దాటించడం వంటి వాటిపైనా ప్రజలకు అనుమానాలు ఉన్నాయి. ఇవన్నీ మోడీ నేతృత్వంలో జరిగినవే అన్న భవనా ఉంది. రాష్ట్ర విభజన ప్రక్రియపై చేసిన విమర్శలు కాంగ్రెస్ పరువుతీయాలన్న లక్ష్యాన్ని నెరవేర్చడానికి బదులు, తన పార్టీకి రాజకీయంగా నష్టం చేకూర్చేలా చేసుకున్నారు. రాష్ట్ర విభజనను కాంగ్రెస్ ప్రజాస్వామికమార్గంలో చేయలేదన్న భావన ఉంటే.. సమస్యలను తాను ఈ విధంగా పరిష్కరించానని చెప్పుకునేందుకు మోడీకి, బిజెపికి కూడా ఏమీ లేదు. ఎందుకంటే ఎపికి ఒక్కటంటే ఒక్క ప్రయోజనం చేకూరలేదు. చర్చకు తావులేకుండా అహంకారంతో నాటి కాంగ్రెస్ వ్యవహరించిందని మోదీ వాదనగా ఉంది. అయితే అనేక బిల్లులను మోడీ కూడా అలాగే చేశారు. ఎన్టీరామారావు ప్రభుత్వాన్ని అస్థిరపరచడం, అంజయ్యను



అవమానించడం వంటి అంశాలను ప్రస్తావించడం ద్వారా కాంగ్రెస్‌వి దెబ్బతీయాలనుకోవడం కూడా సరికాదు. ఎందుకంటే ఈ తరం ప్రజలకు ఇప్పుడు ఆ విషయాలు గుర్తుండి ఉండవు. వారికి పెరుగుతన్న నిత్యావసర ధరలు, పెట్రలో ధరలు, గ్యాస్ ధరలు, ఇంటి నిర్మాణ ధరలు.. జివిస్టీ వాతలు వంటివి మాత్రమే గుర్తుంటున్నాయి. ఈ క్రమంలో వాటిగురించి ప్రస్తావించకుండా ఉండేందుకు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారన్న భావన ప్రజల్లో ప్రబలుతోంది. మోదీ ప్రస్తుత వ్యాఖ్యలు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్నే కాక, బిల్లు ఆమోదంలో కీలకపాత్ర పోషించిన సుష్మాను అవమానిస్తున్నాయని తెలంగాణ వాసులు మూకుమ్మడిగానే భావిస్తున్నారు. నిజానికి మోడీ వచ్చాక ఓ బృహత్తర భారతం ఆవిష్కృతం అవుతుందని అంతా భావించారు. ప్రధానంగా సామాన్యులు చాలా ఆశ పడ్డారు. కానీ జరిగింది అందుకు పూర్తి భిన్నంగా ఉంది. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్‌టీ వరకు తీసుకున్న నిర్ణయాలు ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం,కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడుతున్నా.. మోడీ ఏనాడూ దానిపై చర్చించలేదు. బిజెపి నేతలు కూడా ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. పార్టీలో అంతర్గతంగా చర్చజరగడం లేదు. అయినా ఈ దేశాన్ని ఉద్ధరించేందుకు వచ్చిన మహానుభావుడన్న రీతిలో మోడీని సోషల్ మీడియా వేదికగా పొగగడ్తలతో ముంచెత్తే ప్రచారం మాత్రం సాగుతోంది. తాజాగా జీఎస్టీ భయాలు వెన్నాడుతున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు మోడీ ప్రభుత్వం భరోసాగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులు కుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించ డంలోనే కాలం గడుపుతున్నారు.కనీసం ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అయినా దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై సమగ్ర చర్చకు పట్టుబట్టాలి. అందుకు అనుగుణంగా వాతావరణం సృష్టించుకోవాలి. మంచిరోజులు ముందున్నాయని చెప్పి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ వల్ల ప్రజలకు మంచిరోజులు పోయాయి. ప్రధాని మాటల్లో మాత్రమే వినిపించే 'అచ్ఛేదిన్' వస్తాయో లేదో గానీ ప్రస్తుతం పరిస్తితులు మాత్రం దేశాన్ని కలవరపెడుతున్నాయి. దుర్భరపరిస్థితులు ఎదుర్కొంటున్నారు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

## ముహూర్తం

చాకిచర్ల అనే గ్రామంలో సోమయ్య అనే అతను వడ్డి వ్యాపరం చేస్తూ ఉండేవాడు. ఆగ్రామంలోకాని ,చుట్టు పక్కల గ్రామలకు అతను ఒక్కడే షావుకారు.ఎవరైనా



డబ్బులకోసం వస్తే శుక్రవారం,మంగళవారం అని దీపాలు వెలిగిన తరువాత లక్ష్మీదేవిని ఇవ్వకూడదని అంటూఉండేవాడు. పైగా ప్రతివిషయానికి దుర్ముహూర్తం,రాహుకాలం,యమగండం అటూ తిథులు చూసేవాడు.ఆపదలో ఆదుకునే వాడు కావడంతో అతనికి ఎవరు ఈచాదస్తం నీకు తగదు అనిచెప్పలేక పోయేవారు.

ఒకరోజు సోమయ్య మనవడు వాళ్ళమామిడి తోటలో ఉదయం ఆడుకుంటూ ఉండగా పాముకరచింది. పొరుగున ఉన్ననగర వైద్యశాలకు తన మనవడిని తీసుకువెళ్ళడానికి సోమయ్య కారులో ప్రయత్నించగా కారు స్టార్ట్ కాలేదు. ఆందోళనతో గ్రామంలోనికి వెళ్ళి కనిపించిన వారిని అందరిని ,తనమనవడిని నగరంలోని వైద్యశాలకు పంపడానికి సహాయపడమని అడగసాగాడు.

అక్కడ ఉన్న రంగయ్య అనే రైతు 'అయ్యో ఇప్పుడు రాహుకాలం కదా! వెనువెంటనే దుర్ముహూర్తం వస్తుంది కనుక పన్నెండు నలభై నిమిషాల పైన మంచి ముహూర్తం ఉంది. ఆసమయంలో వైద్యశాలకు తీసుకువెళితే బాగుంటుంది' అన్నాడు.

' రామయ్య ఉదయం పాము కరిస్తే,మధ్యాహ్నం వైద్యశాలకు తీసుకువెళతారా? నువ్వు పరిహాసంచేయడానికి ఇదా సమయం ' అన్నాడు సోమయ్య.

' అయ్యో ఇందులో పరిహాసమేముంది.మొన్నరాత్రి సుందరయ్య వాళ్ళ అమ్మగారికి ఆరోగ్యం బాగాలేక మిమ్ములను డబ్బు అడిగితే శుక్రవారం పైగా దీపాలు పెట్టాక ఇవ్వను అన్నారు.తెల్లవారి ముహూర్తం చూసి మీరు డబ్బు ఇచ్చేదాక ఆమె ప్రాణం ఆగుతుందా ? సమయానికి నావద్దఉన్న డబ్బుతో సర్దుబాటు అయింది 'అన్నాడు రామయ్య.

'అయ్య నామనవడు ఆపదలో ఉన్నాడు జాలిచూపండి 'అన్నాడు సోమయ్య.

'భయపడకండి మాకుమారులు మీమనవడిని మోటర్ సైకిల్ పై వైద్యశాలకు తీసుకువెళ్ళారు.మీవాడికి ప్రాణభయం ఉండదులెండి,

సోమయ్యగారు వందేళ్ళు బ్రతకను అనితెలిసి కూడా మనిషి వేయ్యేళ్ళకు సరిపడా సంపాదిస్తాడు. ముహూర్తం చూసిమనం పుట్టడంలేదు, ముహూర్తం చూసి మనం మరణించడంలేదు. జనన మరణాలకు లేని మూహూర్తం. మధ్యలో ఉన్న జీవితానికి ఎందుకు? మంచిపని ప్రారంభించడానికి,ఎదటివారికి సహాయపడటానికి ముహూర్తం ఎందుకు?

ఇవ్వన్ని మనం కల్పించుకున్నవేకదా 'అన్నాడు రామయ్య.ఇంతలో రామయ్య సెల్ ఫోన్ మోగింది. 'ఫోన్ ఆన్ చేసిన రామయ్య ' పిల్లాడు ఎలాఉన్నాడయ్య' అన్నాడు. అవతలనుండివచ్చి సమాధానం విని 'సరే సాయంత్రంవరకు ఉండి పిల్లవాడిని తీసుకు రండి, సోమయ్యగారు మీవాడికి ప్రాణభయం లేదట,సాయంత్రం ఇంటికి పంపుతారట అప్పటి దాకా వాళ్ళు మీపిల్లాడిదగ్గరే ఉండి చూసుకుంటారు అందోళనపడకండి 'అన్నాడు రామయ్య.

' నిజమే ఎంతకాలం జీవించినా కాటికే, ఎంత సంపాదించినా కూటికే, నాచాదస్తంతో ఇంతకాలం మీఅందరిని ఇబ్బందిపెట్టాను, ఈరోజునుండి నాపాత అలవాట్లకు స్వస్తి పలుకుతున్నాను' అన్నాడు సోమయ్య.

– డా.బెల్లంకొండ నాగేశ్వరరావు.

# అనంత మహిమాన్వితుడు బీర్పూరు నారసింహుడు

### 12 నుండి బీర్పూరు నారసింహుని బ్రహ్మోత్సవాలు

" స్వర్ణాసన పీఠాయ దండకారణ్య వాసినే, శ్రీమద్భీర్పూరీశాయ శ్రీనృసింహాయ మంగళం:" రాష్ట్రం లోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ధర్మపురి సమీపస్థ, భీర్పూర్ మండల కేంద్ర సమీప శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్స వాలు ఫిబ్రవరి 12వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఘనంగా జరుగ నున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలను వైభ వంగా నిర్వహించేందుకు ఈఓ కాంతరెడ్డి ఆద్వర్యంలో, ప్రజాప్రతినిధులు, అధికారులు వలసిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. భీర్పూర్ గ్రామ శివార్లలో పెద్దగుట్ట, చిన్న గుట్టలపై వెలసిన శ్రీలక్ష్మీనర సింహ స్వామి భక్తుల పాలిటి కరుణా కటాక్ష మూర్తిగా, దుష్ట శిక్షకుడుగా, శిష్ట రక్షకుడుగా పేరెన్నిక గన్నారు. పూర్వం అవుసుల ధర్మయ్య అనే అధ్యాప కుడు, తన కుమారు నితో విభేదించి, స్వామిని ఆశ్రయించా డని, ఆచార వ్యవహారాలు, సాంప్రదా యాలను తులనాడే తన కుమారున్ని కడతేర్చి పరువు కాపాడితే, కస్తూరి తిలకాన్ని స్వామికి దిద్దగలనని ధర్మయ్య మొక్కుకోగా, అదేవిధంగా జరగడంతో, వెంటనే మొక్కు తీర్చుకున్నాడనే కథ ఈ ప్రాంతంలో మిగుల ప్రచారంలో ఉంది. నేరేళ్ళ గ్రామానికి చెందిన ఒక గొల్ల బాలుడు, మేకలను మేపుతూ, ఒక రోజున చిన్నగుట్ట పైకి వెళ్ళగా, బాలుని రూపంలో వచ్చిన స్వామి తన దాహం తీర్చమని అబాలుని కోరారు. మేకలన్నింటిని గుహ లోనికి తోలుకెళ్ళి, వాటి పాలతో గొల్ల బాలుడు స్వామి దాహాన్ని తీర్చాడు. అలాగే



గుట్ట దిగుతూ వెను తిరిగి చూడగా తనమంద అనూహ్యంగా పెరగడాన్నిగాంచి, అశ్చర్య చకితుడై, దానిని భగవత్కృపగా భావించి, నేరేళ్ళ సంస్థానాధీశునికి జరిగిన విషయం చెప్పాడట. అంతకు ముందు రోజు స్వామి తనకు కలలో కనిపించి, ఆలయ నిర్మాణానికి సహకరించ మనడాన్ని గుర్తెరిగి, ఆయన వెంటనే నమ్మనాచార్యులకు కబురు పంపాడు. ఆయన సహకారంతో, నమ్మనాచార్యులు అప్పటికే వెలసిన స్వామిని కనుగొని భక్తి శ్రద్ధలతో పూజించి, ఆలయ నిర్మాణం పూర్తి గావించడం జరిగింది. అప్పటినుండి ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తు న్నట్లు చెపుతారు. దేవాలయ ఉత్సవ నిర్వహణకై ఖుతుబ్ షాహీల కాలంలో మాన్యా



లు ఇవ్వ బడినాయని, అయితే ఢిల్లీ సుల్తానులు, ఖుతుబ్ షాహీలపై దండెత్తి గోల్కొండను కైవసం చేసుకున్నాక, అట్టి మాన్యాలను రద్దు పరచినట్లు చెపుతారు. 1881లో నిజాం ప్రభువులు స్వామివారల పేరున ఉన్న మాన్యాలను ఆలయ ధర్మకర్తలు, ప్రధానాచార్యుడైన వొద్దిపర్తి రామానుజాచార్యులనుండి తిరిగి తీసుకున్నారని చారిత్రికా ధారాలున్నట్లు చెపుతారు. ఆ తర్వాత అర్చకులు తుంగూరు, భీర్పూరు, నర్సింహుల పల్లె తదితర గ్రామాల్లో భిక్షాటనచేసి ఉత్సవాలను నిర్వహించారు. అదేవిధంగా అర్షకోట పరగణా క్రింద గల గ్రామాల ప్రజలు స్వామివారి ఉత్సవాల నిర్వహణకు కానుక లను సమర్పిండం అనవాయితీగా మారింది.

### వేడుకల వివరాలు

భీర్పూర్ నృసింహుని ఉత్సవ వేడుకలలో భాగంగా, ఫిబ్రవరి 12న శని వారం ఉదయం కలశ స్థాపన, పుణ్యాహ వాచనం, రక్షాబంధనం, పుట్టబంగారం సాయంతం 6గంటలకు గుట్టపైకి ఊరేగింపు, 13న ఆది వారం సాయంత్రం ధ్వజారోహణం, ఎదుర్కోళ్ళు, 7గంటలకు స్వామి వారల కల్యా ణం, 14వ తేదీ సోమ వారం సాయంత్రం 6గంటలకు అగ్ని ప్రతిష్టాపన, స్థాళిపాక హోమము బలిహరణం, 15వ తేదీ మంగళ వారం ఉదయం 11గంటలకు క్షీరసాగర మథనం, 16వ తేదీ బుధవారం ఉదయం 7గంటలకు చందనోత్సవం, రాత్రి 7గంటలకు తెప్పోత్సవం, డోలోత్సవం, 17వ తేదీ గురు వారం మద్యాహ్నం 3గంటలకు పార్వేట్ ఉత్సవం, 18 తేదీ శుక్ర వారం మద్యాహ్నం 3కు వనమహోత్సవం, 19న శని వారం రాత్రి 7కు వేద సదస్సు, 20న ఆదివారం ఉదయా త్పూర్వం 4గంటలకు దోపుకథ, 21న సోమవారం మద్యాహ్నం 3గంట లకు మహా పూర్ణాహుతి, సాయం త్రం 4గంటలకు రథోత్సవం, రాత్రి 7గంటలకు నాగబలి, చక్ర తీర్థం, 22న మంగళ వారం రాత్రి 7 గంటలకు ఏకాంతోత్సవం, 23న బుదవారం ఉదయం 10 గంటలకు స్వపన తిరు మంజనం,పవిత్రోత్సవం, ప్రధాన కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. దేవస్థానం నిర్వహణాధికారి కాంతా రెడ్డి ఆధ్వర్యంలో, దేవస్థానం చైర్మన్ నేరెళ్ల సుమన్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప రమేశ్, ఎంపీపీ మసర్తి రమేశ్, అర్చకులు, సిబ్బంది బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించే కార్యక్రమాలలో నిమగ్నమైనారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# దేశంలో సమస్యల దండోరా

**పరిష్కరించే సత్తా లేని నాయకత్వం**
**విపక్షాల అనైక్యతే బలంగా మోడీరాజకీయం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు దిగి రావడంలేదు. ద్రవ్యోల్బణం అదుపు కావడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని కాంక్షించిన ప్రజలు రెండోమారు నరేంద్రమోడీకి అధికారం అప్పగించారు. కానీ జరుగుతున్న దేమిటి..? ప్రజల ధన, మాన, ప్రాణాలకే రక్షణ కరువైపోయింది. దేశంలో అత్యాచారాలు, అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. దేశంలో ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా నడుస్తోంది! ఆయన వ్యూహాల ముందు మిగతా పార్టీల వ్యూహాలు చెల్లకుండా పోతున్నాయి. అందుకే నేనే సుపీరియర్ అనే భావనతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఆయన ఇవ్వాళ ఈ స్థాయికి రావడానికి ఆ పార్టీకి చెందిన ఎంతోమంది నాయకులు.. ముఖ్యంగా ఎల్.కె.ఆద్వానీ వంటివారి ఆశిస్సులు ఉన్నాయి. ఇప్పుడు వారినందరినీ ఎక్కడ ఉంచారో అందరికీ తెలిసిందే! ప్రధానమంత్రి కాలేకపోయినా రాష్ట్రపతి అయినా అవుదామనుకున్న ఆద్వానీ కలలను తుంచివేస్తూ, అనూహ్యంగా రామ్‌నాథ్ కోవింద్‌ను తెర మీదకు తెచ్చారు. ఒకప్పుడు వేదికలపై ఆసీనులైన బీజేపీ అగ్ర నాయకులకు వెనుక నుంచి మంచినీళ్ల సీసాలను అందించిన నరేంద్ర మోదీ, ఇప్పుడు అదే నాయకులకు తన ముందు స్వేచ్ఛగా కూర్చోలేని పరిస్థితి కల్పించారు. అంటే పదవితో పాటు గాంభీర్యాన్ని, అహాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో ప్రజల సమస్యలపై నేరుగా చర్చించే అవకాశం లేకుండా చేసుకున్నారు. పార్టీలో దీనిపై చర్చ జరగడం లేదు. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. విదేశీ పర్యటనలకు ఇస్తున్న ప్రాధాన్యం దేశంలో సమస్యలు తెలుసుకోవడానికి ఇవ్వడం లేదు. మామూలుగా అయితే అమెరికా అధ్యక్షుడు సుప్రీం అన్న భావన ఇతర దేశాల అధినేతలకు ఉంటుంది. కానీ మోడీ ఇప్పుడలాంటి భావనలో ఉన్నారన్న భావన కల్పిస్తున్నారు. అందుకే సమస్యలను పరిష్కరించ గలిగామని, వాటిని అధిగమించామని భావిస్తున్నారు. అదేరీతిలో ప్రజలను నమ్మించడానికి ప్రధాని నరేంద్రమోడీ గత ఏడేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకే నోట్ల రద్దు, జివిస్టీ వంటి విషయాలను పార్లమెంటులో ప్రస్తావించి చర్చించే ధైర్యం నేటికీ చేయడంలేదు. వాటివల్ల కలిగిన నష్టాలను పూడ్చే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఎవరూ ప్రశ్నించడానికి వీలుకాని భారీ బహిరంగసభల్లో మాత్రం అనర్గళంగా మాట్లాడుతూ విపక్షాలను దుమ్మెత్తి పోస్తుంటారు. అలాగే పార్లమెంటులో కూడా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఇతర దేశాల అగ్రనేతల ఆలింగనాల్లో సేదతీరుతున్న ప్రధాని మోడీకి దేశంలోని సమస్యలు అస్సలు కనిపించకపోవచ్చు. ప్రవాస భారతీయుల చప్పట్లకు అలవాటు పడిన పెద్దమనిషికి దేశంలోని ప్రజల ఇక్కట్లు వినిపించకపోవచ్చు. అందుకే సమస్యలు పరిష్కారం కాక ప్రజల్లో అసహనం రాజ్యమేలుతోంది. తాము కోరుకున్నదేమిటి? దేశంలో జరుగుతున్న దేమిటి? అనే ప్రశ్న క్రమేణా బలపడుతోంది. అభివృద్ధి పేరుతో, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రధాని దేశాటనలు చేస్తూ దేశ సమస్యలను మాత్రం నడిబజారులో వదిలారు. కాశ్మీర్ ఆందోళనలు, అక్కడ దాడులు, చైనాతో సరిహద్దు సమస్యలు,డార్జిలింగ్ వ్యవహారాలను పరిష్కరించే మార్గాలను అన్వేషించడం లేదు. వీటికి తోడు రైతుల ఆత్మహత్యలు – ఆక్రందనలు, కార్మికుల ఆందోళనలు పట్టించుకోవడం లేదు. నల్లధనంపై పోరాటంలో తాము రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకున్నామని అంటున్నారు. దేశంలో నల్లధనాన్ని, అవినీతిని నిర్మూలించడానికి పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోడీ పదేపదే చెప్పుకొచ్చారు. ఈ చర్య సత్ఫలితాలు ఇచ్చిందో లేదో మాత్రం చెప్పడం లేదు. నగదు రహిత లావాదేవీల నినాదం కూడా తెరవెనుకకు వెళ్లింది. ప్రజలకు సంబంధించిన విషయాలకన్నా ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే ఆలోచనలే మోడీ ముందు ఎక్కువగా ఉంటాయి.

# కొత్త జిల్లాలో సమస్యల తిష్ట

కుమ్రంభీం,ఫిబ్రవరి10 : జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాళ్లతో నిండిన బాటలతో నడక సాగిస్తూ నానా పాట్లు పడుతున్నారు. అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ ఈ జిల్లాలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరజన సంఘాలు కోరుతున్నాయి. అనేకఆ గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ డానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఆయా గూడాల్లోని గ్రామాల్లో ఒక్కగానొక్క బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రామీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. కుమ్రంబీమ్ జిల్లాలోని 15 మండలాల పరిధిలో 486 గ్రామాలకు నేటికీ రహదారుల లేక ప్రజలు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. తిర్యాణి, వాంకిడి, బెజ్జూర్, కాగజ్‌నగర్ మండలాల్లో దారులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారు లే లేని గ్రామాలు 486 ఉంటే ఇక చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుషు లుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వాంకిడి మండలంలోని గ్రామాలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ విద్యుత్తు వెలుగులకు నోచుకో లేదు. కంకర గూడ, టొక్కిగూడ, ఉర్వేతగూడ, ఎల్లానగర్, కాతిగూడ, దోబిపటాత్, సాయిల్‌గూడ గ్రామాల ప్రజలు కిరోసిన్ దీపాల వెలుగుతోనే సహజీవనం చేస్తున్నారు. కెరమెరి,తిర్యాణి మండలాల్లో అనేక గ్రామాల ప్రజలు చీకట్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

# ప్రధాని వ్యాఖ్యలపై సభాహక్కుల ఉల్లంఘన కింద నోటీసులు



మొదటిపేజీ తరువాయి..

అయిన బిల్లును అవహేళన చేయడం సరికాదని తెలిపారు. పార్లమెంటును, సభాపతులను అవమానపరిచేలా ప్రధాని వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సభ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని వెల్లడించారు. ఈ నెల 8న ప్రధాని రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానం ఇచ్చిన సందర్భంగా మాట్లాడారు. పార్లమెంట్ తలుపులు మూసేసి, పెప్పర్ స్ప్రే కొట్టి బిల్లు పాస్ చేశారని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో నోటీసులు ఇవ్వడంతో పాటు వెల్‌లోకి దూసుకెళ్లి టీఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. అలాగే రాజ్యసభ నుంచి టీఆర్‌ఎస్ ఎంపీలు వాకౌట్ చేశారు. తెలంగాణ బిల్లుపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని టీఆర్‌ఎస్ ఎంపీలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. ఇవాళ సభా కార్యక్రమాలు ప్రారంభం కాగానే.. టీఆర్‌ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకువెళ్లారు. సురేశ్ రెడ్డి, సంతోష్ కుమార్, బడుగల లింగయ్య యాదవ్‌లు వెల్‌లోకి వెళ్లి నిరసనలు వ్యక్తం చేశారు. ప్రధానిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై నిర్ణయం తీసుకోవాలని ఎంపీ కేశవరావు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్‌ను కోరారు. ఆ సందర్భంలో ఆయన స్పందిస్తూ.. సభ హక్కుల నోటీసు అందిందని, కానీ దానిపై చైర్మెన్ వెంకయ్య నిర్ణయం తీసుకుంటారని హరివంశ్ తెలిపారు. చైర్మెన్ పరిశీలన కోసం ప్రివిలేజ్ నోటీసును పంపినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ తో పాటు ఇతర విపక్షాలు కూడా టీఆర్‌ఎస్ వాదనతో ఏకీభవించాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా టీఆర్‌ఎస్ కు మద్దతు పలికారు. ప్రివిలేజ్ నోటీసుపై చైర్మన్ నిర్ణయం తీసుకునే వరకు సభకు వెళ్లరాదని తెరాస ఎంపీలు నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ప్రధానమంత్రి తీరుపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటుపై ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అదేవిధంగా ఎనిమిదేళ్ల తర్వాత కూడా ప్రధాని మీడియా సమావేశంలో ప్రశ్నల వర్షం కురిపించకుండా, మీడియాకు ఇచ్చే ఇంటర్వ్యూలపైనే ఆధారపడాల్సి రావడం సిగ్గుచేటు అన్నారు. రెండు సభల్లో పాసైన బిల్లుపై ప్రధాని కామెంట్ చేయడం శోచనీయమన్నారు. ప్రధాని మోదీపై లోక్‌సభలో కూడా ప్రివిలేజ్ నోటీసు తెరాస ఎంపీలు ఇవ్వనున్నారు. ఈ మధ్యాహ్నం స్పీకర్‌ను కలిసి ప్రివిలేజ్ నోటీసు ఇస్తామన్నారు. సుదీర్ఘ ఉద్యమం, ప్రాణ త్యాగాల అనంతరం తెలంగాణ తెచ్చుకొన్నామని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు చెప్పారు. ప్రధాని వ్యాఖ్యలపై యావత్తు తెలంగాణ ప్రజలు ఎంతో బాధ పడుతున్నారన్నారు. లోక్‌సభలో రూల్ 222 కింద ప్రధానిపై సభాహకుల ఉల్లంఘన నోటీసు ఇచ్చామని, సభలో మాట్లాడే అవకాశమివ్వాలని స్పీకర్‌ను కోరామని చెప్పారు. తెలంగాణకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేక టీఆర్‌ఎస్ ఎంపీలందరూ సమావేశాలను బాయ్‌కాట్ చేశామని తెలిపారు. తెలంగాణ ప్రజలు తమకు ఓట్లు వేసి ఢిల్లీకి పంపించారని, ఆ ప్రజలకు అండగా ఉండటం తమ బాధ్యత అని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రూపాయి కూడా ఇవ్వని విషయాన్ని తెలంగాణ నుంచి ఎన్నికైన ఇతర పార్టీల ఎంపీలు గుర్తుంచుకోవాలన్నారు. గుజరాత్ కంటే తెలంగాణలో ఎకువ అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. అన్ని రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉంటే సహాయం ఇవ్వాల్సిందిపోయి అడ్డుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధానికి తెలంగాణ అంటే చిన్నచూపు ఉన్నదని, అందుకే ఎనిమిదేండ్లలో ఒక విభజన హామీ కూడా తీర్చలేదని చెప్పారు. కొత్త రాష్ట్రానికి సమస్యలు ఉంటే తీర్చాల్సింది పోయి.. ఇంకా సృష్టిస్తున్నారని విమర్శించారు. అనంతరం తెలంగాణ భవన్‌లోని అంబేదర్ విగ్రహం వద్ద ఎంపీలు కేకే, నామాతోపాటు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సంతోష్‌కుమార్, బీబీ పాటిల్, రంజిత్‌రెడ్డి, పీ రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ నేత, బడుగుల లింగయ్య యాదవ్ మోదీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన తెలిపారు.రాజ్యాంగంపై గౌరవంతో తాము తీర్మానమిచ్చామని కేశవరావు తెలిపారు. ఒకవేళ నోటీసును స్వీకరిస్తే ప్రివిలేజ్ కమిటీ విచారణ జరిపే అవకాశముంటుందని, సభాహక్కుల ఉల్లంఘన నిరూపణ జరిగి ప్రివిలేజ్ కమిటీ సిఫారసు చేస్తే జైలుకు కూడా పంపే అవకాశముంటుందని చెప్పారు. ఈ తీర్మానం ఆషామాషీగా ఇచ్చింది కాదని, రాజ్యాంగం, పార్లమెంటుపై గౌరవంతో ఇచ్చామని అన్నారు. ప్రధానికి ఏమాత్రం ఇంగిత జ్ఞానం ఉన్నా క్షమాపణ చెప్పడం లేదా, వెనక్కి తీసుకోవడం చేస్తారన్న ఆశాభావం వ్యక్తంచేశారు. బిల్లు పాసైన విధానాన్ని సిగ్గుచేటు అన్న ప్రధాని తెలంగాణకు వ్యతిరేకి కాకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. పార్లమెంటు నిర్వహణకు ఒక విధానం ఉం టుందని, సభలో ప్రొసీడింగ్స్ చూడాల్సిన ప్రిసైడింగ్ అధికారి నిబంధనలకు అనుగుణంగా నడుచుకొంటారని చెప్పారు. సభానాయకుడు అయిన ప్రధాని ఆ ప్రొసీడింగ్స్‌ను, ప్రొసీజర్‌ను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది కచ్చితంగా సభా హక్కుల ఉల్లంఘనేనని అన్నారు. ప్రధాని ఏ ఉద్దేశంతో మాట్లాడారో తమకు తెలియదని చెప్పారు. 'యూపీ ఎన్నికలా? మరో అంశమా! అన్న విషయం మాకు తెలియదు. కానీ, పార్లమెంటు వ్యవహారాలను చెడుగా చూపడం మాత్రం దుర్మార్గం' అని స్పష్టంచేశారు. 'మైకులు ఆపేశారు, పెప్పర్ స్ప్రే చేశారు, చర్చ జరగలేదు' అని ప్రధాని అనడం ఆయన అవగాహనలేమికి నిదర్శనమన్నారు. సభ ఆర్డర్ లేకపోతే లాబీ ఖాళీచేసి.. తలుపులు మూసేయడం ప్రిసైడింగ్ అధికారి నిర్ణయమని తెలిపారు. ఒకసారి బిల్లు పాస్ అని స్పీకర్, చైర్మన్ చెప్తే అదే అంతిమ నిర్ణయమన్నారు. ప్రధానిపై సాధారణంగా ఎవరూ ప్రివిలేజ్ మోషన్ ఇవ్వరని, కానీ ఇవాళ ఆ పరిస్థితి రావడానికి ప్రధాని వ్యాఖ్యలే కారణమని స్పష్టంచేశారు. ఇలా ప్రివిలేజ్ నోటీస్ ఇవ్వ డం తమకూ బాధగానే ఉన్నదన్నారు. కానీ మోదీ సభను అవమానపరిచేలా, తెలంగాణ ఏర్పాటే సిగ్గుచేటు అని అర్థం వచ్చేలా మాట్లాడారని పేర్కొన్నారు.

## నేడు జనగామలో కేసీఆర్ పర్యటన

మొదటిపేజీ తరువాయి..

గులాబీమయం అయిపోయింది. జనగామలో ఇప్పటికే టీఆర్‌ఎస్, బీజేపీల మధ్య ఓ రేంజ్‌లో వార్ నడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ సభకు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అటు 12వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటిస్తారు సీఎం కేసీఆర్. టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఇదిలావుంటే సమీకృత కలెక్టరేట్‌తో పాటు,టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సిఎం కెసిఆర్ ప్రారంభిచనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిఎం కెసిఆర్ రాక సందర్భంగా ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే జనగామ జిల్లా అభివృద్ధి చెందిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయకపోయినా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని చెప్పారు.



గురువారం ఆయన మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ వల్లే జనగామ జిల్లాల్లో నీటి సమస్య తీరిందని, దేవాదుల ద్వారా జిల్లాలో ప్రతి చెరువు నింపామన్నారు. కేసీఆర్ కృషి వల్లే ఇవాళ తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ కృషికి కృతజ్ఞతగా జనగామ జిల్లాలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ వెనుక నిలబడి తెలంగాణను కాపాడుకోవాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. టీఆర్‌ఎస్ బహిరంగ సభకు లక్షకుపైగా ప్రజలు హాజరవుతారని మంత్రి పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చే సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ జనగామ పర్యటనకు వస్తున్నారని, ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణుల తరఫున స్వాగతం పలుకుతున్నామన్నారు. గతంలో సీఎం కేసీఆర్ సభ వాయిదా పడింది, ఈ క్రమంలోనే కేసీఆర్ రాక కోసం జిల్లా ప్రజలంతా ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు.ఎడారిగా ఉన్న జిల్లా కేసీఆర్ నాయకత్వాన ఇప్పుడు సస్యశ్యామలమైందన్నారు. తెలంగాణ వస్తే ఏం వస్తుందన్న వారికి.. ప్రారంభించే సమీకృత కలెక్టరేట్, ఇప్పటికే వచ్చిన సాగు, తాగునీరు ఎలా వచ్చింది చూస్తే అర్థమవుతుందన్నారు. కరువు జిల్లాలో ఇకపై నీళ్లు రాని ఊరు ఉండొద్దని సీఎం కేసీఆర్ చెప్పారని, అవసరమైతే లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి ఇవ్వాలన్నారని మంత్రి తెలిపారు. ఫలితంగా నేడు రైతులు పంటలు పండిస్తున్నారని, దేశంలో ఒకే పంటలోనే అత్యధికంగా దిగుబడి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించిందన్నారు.

చరిత్ర తెలియని వ్యక్తి దేశానికి ప్రధానిగా ఉండడం దురదృష్టకరమని సత్యవతి రాథోడ్ విమర్శించారు. తెలంగాణపై బీజేపీ అన్యాయంగా మాట్లాడుతుందని, రాష్ట్రాన్ని అన్యాయంగా ఇచ్చినట్లు ప్రధాని అంటున్నారని ఆరోపించారు. ఎవరితో సాధ్యం కాని తెలంగాణ.. కేసీఆర్‌తో సాధ్యమైందన్నారు. అలాగే దేశంలోని నాయకులను కూడగట్టుకొని తన పదవికి ఎసరు పెడతారని భావించి అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో బహిరంగ సభకు ప్రజలను తరలించే క్రమంలో నేతలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవ రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఇతర నాయకులు ఉన్నారు. సీఎం కేసీఆర్ ఈ నెల 12 వ తేదీన భువనగిరి సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించనున్నారు. భువనగిరి శివార్లలోని రాయగిరిలో బహిరంగ సభ ఏర్పాట్లను విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి గురువారం పరిశీలించారు. కొత్తగా నిర్మించిన జిల్లా కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం రాయగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన జగదీశ్ రెడ్డి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సభకు వచ్చే ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కూడా అందుబాటులో ఉంచారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఈటల రాజేందర్, రాజాసింగ్‌ల గృహనిర్బంధం

**జనగామ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**

- ప్రభుత్వ నిరంకుశత్వం ఎక్కువ కాలం సాగదన్న ఈటల
- మేమేమన్న ఉగ్రవాదులమా అంటూ రాజాసింగ్ ప్రశ్న
- **జనగామలో మరోమారు ఉద్రిక్తత**
- **బీజేపీ దీక్షలను అడ్డుకున్న పోలీసులు**
- **పోలీసుల తీరుపై మండిపడ్డ బీజేపీ నేతలు**

హైదరాబాద్,ఫిబ్రవరి10: హుజురాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను గురువారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్ర విభజనపై ఇటీవల ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం టీఆర్‌ఎస్ కార్యకర్తలు చేపట్టిన నిరసనల్లో పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మోదీకి వ్యతిరేకంగా టీఆర్‌ఎస్, టీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు పోటాపోటీగా ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జనగామలో టీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. బీజేపీ కార్యకర్తలపై టీఆర్‌ఎస్ దాడులకు నిరసనగా జనగామలో గురువారం బీజేపీ మౌనదీక్షకు పిలుపునిచ్చింది. అయితే టీఆర్‌ఎస్ కార్యకర్తల దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జనగామ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఈటల రాజేందర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో పోలీసుల తీరుపై ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన హక్కులు ఉంటాయని అన్నారు. నిరసనలు, బంద్‌లు చేసేందుకు టీఆర్‌ఎస్ పార్టీకీ మాత్రమే అనుమతిస్తారా అంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. దాడులు చేసిన వారి పక్షాన పోలీసులు నిలుస్తారా అని నిలదీశారు. ఇది ఎక్కువ కాలం చెల్లదని ఈటల హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన హక్కులుంటాయని, ఇలా తనను అరెస్టు చేయడం సరికాదని ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు టీఆర్‌ఎస్‌కు తలొగ్గారని విమర్శించారు. ప్రజాసంఘాలు, ఇతర పార్టీలకు మాట్లాడే అధికారం, నిరసన తెలిపే అధికారం తెలంగాణలో లేదా అని అధికార ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరోవైపు, గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కూడా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. తమ పార్టీ కార్యకర్తలను పరామర్శించేందుకు జనగామ వెళ్లాలనుకున్నానని.. పోలీసులు తీరు సరిగా లేదని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బీజేపి ఎమ్మెల్యేలను హౌజ్ అరెస్టు చేయడం అప్రజాస్వామికం, మేమేమన్న ఉగ్రవాదులమా?' అంటూ టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై రాజాసింగ్ విరుచుకు పడ్డారు. జనగామలో తమ కార్యకర్తలపై టీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని.. పోలీసులు వారికి సహకరించారని రాజాసింగ్ ఆరోపించారు. ఈ క్రమంలోనే తమ నేత బండి సంజయ్ ఆదేశాల మేరకు కార్యకర్తలను పరామర్శించడానికి వెళ్తుంటే .. ప్రభుత్వం తమని అరెస్టు చేయడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమని రాజాసింగ్ విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందన్నారు. ప్రతిపక్షాలను హౌజ్ అరెస్టు చేయడం కాదు.. త్వరలోనే రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను ఫామ్ హౌజ్ అరెస్ట్ చేస్తారన్నారు. కేసీఆర్‌కు బీజేపీ ఎమ్యెల్యేలు, ఎంపీలంటే భయం పట్టుకుందని, అందుకే ఈ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. జనగామలో మరోమారు ఉద్రిక్తత నెలకొంది. టిఆర్‌ఎస్,బిజెపి నేతలు పరస్పర గర్షణకు దిగారు. బుధవారం టీఆర్‌ఎస్ చేపట్టిన దిష్టిబొమ్మల దగ్గం నేపథ్యంలో ఇరుపార్టీల మధ్య ఘర్షణ జరిగింది. దీనినినిరసిస్తూ బీజేపీ నేతలు గురువారం ఉదయం జనగామ ప్రధాన కూడళ్లలో దీక్షకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మౌనదీక్ష చేసేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో టీఆర్‌ఎస్ అక్కడికి చేరుకుని నినాదాలు చేయడంతో స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ వివాదంలో జనగామ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దశమంత్ రెడ్డితో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఇంత వివాదం జరుగుతున్నా టీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయకుండా బీజేపీ నేతలను మాత్రమే అదుపులోకి తీసుకుని అడ్డుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదానికి పోలీసులే ప్రధాన కారణమని పోలీసులు టీఆర్‌ఎస్ పార్టీకి కొమ్ము కాస్తున్నారని, చట్టం అందరికీ సమానంగా ఉండాలని ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. విభజనపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తెరాస, కాంగ్రెస్ పార్టీలు భాజపాపై విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో జనగామ చౌరస్తాలో కాంగ్రెస్, తెరాస ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాన్ని భాజపా శ్రేణులు అడ్డుకోవటంతో ఉద్రిక్తతకు దారితీసింది. ఇరు పార్టీల శ్రేణులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. తెరాస, భాజపా శ్రేణులు పోటాపోటీ నినాదాలు చేసుకున్నాయి. సహనం కోల్పోయిన భాజపా, తెరాస కార్యకర్తలు కర్రలతో కొట్టుకున్నారు. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. జనగామలో టీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలకు మధ్య జరిగిన తదితరులు పరామర్శించారు.

## ఆర్బీఐ వడ్డీరేట్లు యధాతథం

ద్రవ్యపరపతి విధానంపై గవర్నర్ శక్తకాంత్ దాస్ ప్రకటన

ముంబయి,ఫిబ్రవరి10: ఈ సారి కూడా వడ్డీ రేట్లలో మార్పులు చోటుచేసుకోలేదు. కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తిదాస్ గురువారం వెల్లడించారు. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆయన వెల్లడించారు. రెపో రేటు 4 శాతం, రివర్స్ రెపో రేటును 3.35 శాతం యధావిధిగా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కాగా, కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడం ఇది పదోసారి. ఆర్థిక వృద్ధికి తోడ్పాటునందించేందుకు ఈ సారి ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కరోనాతో కుదేలైన ఆర్థిక వ్యవస్థను ఊతమిచ్చేందుకు 2020 మే నెలలో రెపో రేటును 4 శాతానికి కుదిస్తూ ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ఈ సమావేశంలో వృద్ధి రేటు అంచనాలను 9.2 శాతానికి కుదించింది. డిసెంబర్ నాటి సమావేశంలో ఇది 9.5 శాతంగా అంచనా వేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 7.8 శాతం వృద్ధిని అంచనా వేసింది. ప్రైవేట్ క్రిప్టోకరెన్సీల వల్ల స్థూల ఆర్థిక వ్యవస్థకి ముప్పు కలుగుతుందని శక్తికాంత దాస్ చెప్పారు. వీటివల్ల దేశ ఆర్థిక సుస్థిరతకు విఘాతం కలుగుతుందన్నారు. సవాళ్ళను ఎదుర్కొనడంలో ఆర్బీఐ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయని వివరించారు. వీటిలో పెట్టుబడి పెట్టేవారు తమ స్వంత రిస్క్‌తోనే ఆ పని చేస్తున్నట్లు గుర్తుంచుకోవాలని కోరారు. అప్రమత్తంగా ఉండాలని పెట్టుబడిదారులను హెచ్చరించడం తన కర్తవ్యమని తెలిపారు. క్రిప్టోకరెన్సీకి ఎటువంటి ఆధారాలు లేవని పెట్టుబడిదారులు గమనించాలని చెప్పారు. అది కనీసం టులిప్ అయినా కాదన్నారు. 17వ శతాబ్దంలో టులిప్ మానియా నడిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఫైనాన్షియల్ బబుల్‌కు ఉదాహరణగా దీనిని చెప్తూ ఉంటారు. వాస్తవ విలువ కారణంగా కాకుండా స్పెక్యులేటర్ల కారణంగా టులిప్ విలువ పెరుతూ ఉండేది. ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్షను శక్తికాంత దాస్ ప్రకటించారు. రెపో, రివర్స్ రెపో రేట్లను యథాతథంగా కొనసాగించారు. ఈ సందర్భంగా క్రిప్టోకరెన్సీల గురించి మాట్లాడారు. ప్రైవేటు క్రిప్టోకరెన్సీలు లేదా మీరు ఏ పేరు పెట్టి పిలిచినా సరే, అవి మన స్థూల ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు, ఆర్థిక సుస్థిరతకు పెను ముప్పు కలిగిస్తాయన్నారు. ఆర్థిక సుస్థిరత, మేక్రోఎకనమిక్ సుస్థిరత సమస్యలను ఎదుర్కొనడంలో ఆర్బీఐ సామర్థ్యానికి విఘాతం కలిగిస్తాయని చెప్పారు. ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్షలో గృహ, ఆటో రుణాల గ్రహీతలకు ఉపశమనం లభించలేదు. సమీప భవిష్యత్తులో వీరి ఈఎంఐలు తగ్గే అవకాశం లేదు. 2022 బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రతిపాదించిన అనంతరం ఈ సమీక్ష జరిగింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఇదే చివరి సమీక్ష కానుంది. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మంగళవారం నుంచి సమీక్ష నిర్వహించారు. వీరంతా ఏకగ్రీవంగా ఈ రేట్లను మార్చకూడదని నిర్ణయించారు. వృద్ధికి ఊతమివ్వడం కోసం ద్రవ్యోల్బణాన్ని నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఉండటం కోసం అవసరమైనంత వరకు ఇదే ధోరణిని కొనసాగించాలని నిర్ణయించింది. కమర్షియల్ బ్యాంకులకు నిధులను సమకూర్చినపుడు ఆర్బీఐ వసూలు చేసే వడ్డీ రేటును రెపోరేటు అంటారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ఆర్బీఐ ఉపయోగించే సాధనమిది. బ్యాంకుల నుంచి ఆర్బీఐ రుణాలను తీసుకున్నపుడు ఆ బ్యాంకులకు ఆర్బీఐ చెల్లించే వడ్డీ రేటును రివర్స్ రెపో రేటు అంటారు.

## ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఉద్యోగులు

### నల్ల బ్యాడ్జీలతో నిరసనలు

హైదరాబాద్,ఫిబ్రవరి10: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అనుచిత వ్యాఖ్యలపై గురువారం టీజీవో, టీఎన్జీవో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణకు ద్రోహం చేసే నాయకులను సహించేది లేదంటూ నగరంలోని కార్యాలయ




భవనాల ఎదుట పెద్ద ఎత్తున నినదించారు. దాదాపు 60 సంవత్సరాలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నామని, రాష్ట్ర ఏర్పాటును కించపరిచినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని, వెంటనే ప్రధాని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీజీవో అధ్యక్షురాలు, టీఈజేఏసీ సెక్రెటరీ జనరల్ మమత డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగులంతా నాటి ఉద్యమ నేత సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమించామని, అలాగే నేడు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం 30శాతం పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులకు అనుకూలంగా ఉంటే.. ఆదాయపన్ను పరిమితిని పెంచకుండా కేంద్రం ఉద్యోగులపై వివక్ష చూపుతుందని, తక్షణమే ఆదాయ పన్ను పరిమితిని 10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ప్రతాప్, టీజీవో, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణాయాదవ్, ముజిబ్, సుజాత, సబిత, సాయిపూర్ణచంద్రరావు, సులోన, లక్ష్మీపతిరెడ్డి, డీ బాలకుమార్, ప్రవీణ్ కుమార్, డీ వినయ్ కుమార్, ఎన్ వినోద్ కుమార్, రెడ్డప్పా, ఆనంద్, కిశోర్, ఏ ఆనంద్ కుమార్, ఆర్ సుబ్బారావు పాల్గొన్నారు.

### మార్చి 27న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10: ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ తప్పనిసరి కాదని నిర్వాహకులు అన్నారు. గతేడాది స్ట్రిక్ట్ రూల్స్‌తో ఇన్‌డోర్ లో అవార్డుల ప్రదానం చేశారు. వ్యాక్సిన్ తీసుకున్నావారికి కూడా అవార్డుల ముందు... కరోనా టెస్టులు చేయనున్నారు. తీసుకోని వారికి స్ట్రిక్ట్‌గా టెస్టులు చేస్తామన్నారు. వ్యాక్సిన్ వేసుకోని వారికి నో ఎంట్రీ ఇవ్వడం వల్ల నామినీలు, ప్రెజెంటర్లు వేడుకకు హాజరు కాలేకపోతున్నారన్నారు. ఆస్కార్ అవార్డుల వేడుక జరిగే లాస్ ఏంజిల్స్ లో ఇండోర్ మాస్కు విధానాన్ని ఇంకా ఎత్తివేయలేదు. దీంతో మార్చి 27న జరిగే ఆస్కార్ వేడుకలో మాస్కు విధానం తప్పనిసరంటున్నారు.



జనగామ ప్రీమియర్ లీగ్ 2022 క్రికెట్ టౌర్నమెంట్ ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ గ్రౌండ్ లో ఫైనల్ మాచ్ లో విన్నర్‌గా ప్రెస్టన్ టీం, రన్నర్‌గా బెస్ట్ ఫ్రెండ్స్ టీం నిలిచింది. పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ పోకల జమున లింగయ్య, నిర్వాహకులు టి.సురేష్ రెడ్డి డాక్టర్ కార్తీక్, ఆర్గనైజర్స్ శ్రీధర్ గౌడ్, బాసిత్ రెండవ వార్డ్ కౌన్సిలర్ వి. అనిత కౌన్సిల్లర్లు రహమాన్, దయాకర్, రాజు, ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కరెస్పాండంట్ బక్క ప్రవీణ్ కుమార్





సర్వహంగులతో ప్రారంభోత్సవానికి సిద్దమైన జనగామ కొత్త కలెక్టరేట్. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కెసిఆర్ శుక్రవారం ప్రారంభిస్తారు.



జనగామ జిల్లాలో సిఎం పర్యటన సందర్భంగా బిజెపి నాయకుల అరెస్టులకు నిరసనగా లింగాల ఘనపురం మండల కేంద్రంలో టవర్ ఎక్కిన బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు.

## సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేపీ నాయకులు

**చిగురుమామిడి ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలి. రాజ్యాంగాన్ని మార్చాలని, తిరిగి కొత్త రాజ్యాంగాన్ని రూపొందించాలంటూ సీఎం



కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం చిగురుమామిడి మండల అధ్యక్షులు దుద్దేల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు పోలోజు సంతోష్, పైడిపెల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు పొన్నం శ్రీనివాస్, యువ మోర్చా అధ్యక్షులు శ్రీమూర్తి సతీష్ కార్యదర్శి నక్క రాజేందర్, శ్యామకుర శేఖర్, బొమ్మగాని మధు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రవాణా కేసులో ఒకరికి పిడియాక్ట్

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట సబ్ డివిజన్ వివిధ స్టేషన్ల పరిధిలో ఎన్డిపిఎస్ చట్టం కింద పలు కేసులలో నిందితుడు అయిన ధర్మసాగర్ మండలం ఇండస్ట్రియల్ ఏరియా రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆసిఫ్ అలీ (36) పై పిడియాక్ట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి తెలిపారు. మాదక ద్రవ్యాల కేసులలో నిందితుడు అయిన మొహ్మద్ ఆసిఫ్ వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో మరోసారి కేసు నమోదు



కావడంతో ఆసిఫ్ పై పీడీ యాక్ట్ విధించి చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎల్కతుర్తి సీ.ఐ. శ్రీనివాస్ మరియు వంగర ఎస్సై నవిత తెలిపారు. ఈ సందర్భంగా సి.ఐ. మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అమ్మడం, రవాణాకు పాల్పడితే సహిచేది లేదని, ఖచ్చితంగా చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



వేలేర్ మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న బండ తండా గ్రామ శివారులో నారాయణ గిరి గ్రామానికి చెందిన దున్నపోతుల శ్రీకాంత్ అనే వ్యక్తి ని, ట్రాక్టర్ను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపిన వేలేర్ ఎస్.ఐ. నవీన్ కుమార్, కానిస్టేబుల్ ఉప్పలయ్య

# కోట్లాది రూపాయలతో డెవలప్‌మెంట్ వర్క్స్

## మంత్రి తలసాని

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించడం జరిగిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం బన్సీలాల్ పేట డివిజన్‌లోని డీ క్లాస్ ప్రాంతంలో కార్పొరేటర్ కుర్మ హేమ లత, వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాత్రివేళలో బస్తీలో తిరగాలంటే ఇబ్బందికరంగా ఉందని, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా డ్రైనేజి లైన్ ఏర్పాటు చేయాలని మంత్రిని స్థానిక మహిళలు కోరారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా డీ క్లాస్ ను ఆనుకొని ఉన్న పార్సి గుట్ట ఖాళీ స్థలంలో పెరిగిన చెట్ల కొమ్మలను



తొలగించాలని, ప్రహారీగోడ ను నిర్మించాలని స్థానిక ప్రజలు పలువురు మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి వెంట జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, ఈఈ సుదర్శన్, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, ఏఈ రవీందర్, వాటర్ వర్క్స్ జీఎమ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్స్ ఇవ్వండి...నిరుద్యోగ భృతి చెల్లించండి..

## బీజేవైఎం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 10 ( ప్రజామంటలు):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్



చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పద్మారావునగర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో స్టేట్ బీజేవైఎం ప్రెసిడెంట్ భానుప్రకాశ్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ప్రెసిడెంట్ శ్యాంసుందర్ గౌడ్ లు మాట్లాడుతూ.... ఎన్నికల సమయంలో భారీగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాకా ఏరు దాటాకా.. తెప్ప తగలేసినట్లు.... యువతను పూర్తిగా మరిచిపోయి, వారి ఉసురు పోసుకుంటున్నాడని విమర్శించారు. ఈసందర్భంగా దాదాపు ఒక వెయ్యి మంది యువతీ, యువకులు వచ్చి కోటి సంతకాల సేకరణలో భాగంగా తమ సంతకాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం ప్రెసిడెంట్ మద్దూరి శివాజీ, వైస్ ప్రెసిడెంట్ రాయని పవన్ పటేల్, స్టేట్ కమిటీ మెంబర్స్ ప్రవీణ్ చంద్ర, అభిలాష్, రాజునేత, నరేశ్, జిల్లా కమిటీ భాద్యులు సందీప్, రఘురామ్, రాజా, శక్తి, శివాజీ, గంగ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన బాలికను క్షణాల్లో తల్లిదండ్రుల వద్దకు చేర్చిన కెయూ పోలీసులు

**హనుమకొండ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** గృహ ప్రవేశం కోసం అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వచ్చి తప్పి



పోయిన ఐదు సంవత్సరాల బాలికను క్షణాల్లో తల్లి దండ్రులకు కేయూసి పోలీసులు అప్పగించారు. వివారల్లోకి వేళితే గృహప్రవేశం నిమిత్తం గోపాల్ పూర్ లోని అమ్మమ్మ ఇంటికి తన తల్లిదండ్రులతో కల్సి హైదరాబాద్ నుండి ఐదు సంవత్సరాల బాలిక తన అమ్మమ్మ ఇంటి ముందు స్థానిక పిల్లలతో కలసి ఆడుతూ తన అమ్మమ్మ ఇంటికి దూరం కావడంతో బాలిక తిరిగి ఇంటి వెళ్లేందుకు దారి మర్చిపోయి రోడ్డుపై నిల్చోని ఏడుస్తుండగా అదే సమయంలో అ ప్రాంతానికి వచ్చిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ యుగంధర్, సతీష్ కుమార్ తప్పినపోయిన బాలికను వివరాలు తెలుసుకొని బాలిక తల్లిదండ్రుల పేర్లు హైదరాబాదులోని స్కూల్ పేరు మాత్రమే తెలియ జేయడంతో అప్రమత్తమైన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్లు బాలికను కెయూసి పోలీస్ స్టేషన్ తరలించి తప్పిపోయిన బాలిక ఫోటోను వివిధ సామాజిక మాద్యామాల్లో పోస్ట్ చేయడంతో ఈ సమాచారం విస్తృతంగా ప్రచారం చేశారు.

ఈ సమాచారం పాప తల్లికి తెలియడంతో సదరు బాలిక తల్లి కెయూసి ఇన్స్ స్పెక్టర్ జనార్ధన్ రెడ్డిని సంప్రదించడంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్లు తిరిగి బాలికను తల్లికి అప్పగించారు. దింతో బాలిక తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. తప్పిపోయిన తన కుమార్తెను క్షేమంగా తమకు తిరిగి అప్పగించి నందుకు తల్లిదండ్రలతో పాటు బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్లు యుగేంధర్, సతీష్ కుమార్‌తో పాటు కెయూసి ఇన్స్ స్పెక్టర్ జనార్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

# జనగామ బంద్‌కు మద్దతు ప్రకటించిన టిడిపి

**జనగామ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** జనగామలో మెడికల్ కాలేజీ ప్రారంబించడానికి వచ్చి నేనే కొబ్బరి కాయ కొడతానని చెప్పిన కెసిఆర్ మేము కొబ్బరి కాయలతో సిద్దంగా ఉన్నామని తెలుగు యువత రాష్ట్ర



ప్రధాన కార్యదర్శి రామిని హరీష్ అన్నారు. జనగామలో పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య పత్రిక విలేకరులతో సమావేశంలో ఆయన సీఎం కెసిఆర్ ఎప్పుడు వచ్చినా కొబ్బరికాయలు కావాలంటే అప్పుడే ఇయ్యడానికి మేము ముందు వరుసలో ఉంటామని, మీరు చెప్పిన మాటలు మాకు ఇంకా చెవిలో మ్రోగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ను ప్రారంభోత్సవంకు కొబ్బరికాయ కొట్టాలని మీకు కొబ్బరికాయలను ఎప్పుడు అడిగిన ఇయ్యడానికి సిద్ధంగా ఉన్నామని దుయ్యబట్టారు. జెఎసి ఇచ్చిన జనగామ బంద్ కు టిడిపి మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. బంద్ విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చీకట్ల నవీన్ గౌడ్, రాష్ట్ర తెలుగు యువత కో ఆర్డినేటర్ సూరుగు సతీష్ గౌడ్, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు బడిదె మైశయ్య, జిల్లా కార్యదర్శి పరకాల శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధికార ప్రతినిధి తాళ్లపల్లి ఏళ్ళేష్, పట్టణ ఉపాధ్యక్షుడు చెన్నోజు ఆంజనేయులు, రైతు సంగం తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ప్రుకోధర్ రెడ్డి, నాయకుడు నర్రా నవీన్, గద్దం కృష్ణ, మామిడాల యాదగిరి, బుడిధి సత్యనారాయణ, మైనార్టీ నాయకులు ఎండీ చోటమియా, ఎండీ సీరాజ్, ఎండీ. ఎక్బాల్ మాచర్ల బిక్షపతి, బాబ్జీ, వాలబోజు సురేందర్, కనకరాజు, పట్టణ యువత అధ్యక్షుడు సుద్దాల సురేష్, అన్వేష్, శ్రీకాంత్, బాలరాజు, కిషన్, గోళ్ళ శ్రీనివాస రావు, నర్మేట నుండి మల్లేష్, సిద్దులు, లింగాల ఘనపూర్ మెంతన కిష్టయ్య పాల్గొన్నారు.

# జనగామ జిల్లా పెంబర్తి గ్రామంలో దీక్ష

**జనగామ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** దేశంలో సమస్యలు పెరగడానికి భారత రాజ్యాంగం కాదు కారణం




కాదని, రాజ్యాంగ వ్యవస్థ ద్వారా ఎన్నికైన పాలకుల వైఫల్యమే కారణమని ఎం.ఎస్.పి. జనగామ జిల్లా నాయకులు నిర్మాల భాస్కర్ మాదిగ, ఆత్మకూరి భాను చందర్ మాదిగ అన్నారు. జనగామ జిల్లా పెంబర్తి లో దీక్ష ను ప్రారంబించి మాట్లాడారు.ప్రజలకు ఉపయోగపడే చట్టాల ఏర్పాటుకు, సవరణకు, ఇబ్బందికర చట్టాల రద్దుకు ఆర్టికల్ 386 ఉండగా రాజ్యాంగాన్ని మార్చాల్సిన పనేంటో కెటిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ వైఫల్యాలను ఒప్పుకోకుండా రాజ్యాంగంపై నింద వేయడం ఏమిటని అన్నారు. రాజ్యాంగం ద్వారా ఎదిగి నేడు దోర మెప్పు కోసం చేసే ప్రకటనలు దొర బానిసలు చేసే పనే తప్ప అంబెడ్కర్ వాదులు చేసే పని కాదని అన్నారు.కడియం, గువ్వల, బాల్క సుమన్ లు పద్ధతి మార్చుకోవాలని అన్నారు. భారత రాజ్యాంగ సవరణ కోరుకోవడం వేరు, కొత్త రాజ్యాంగం కావాలనడం వేరు అని అన్నారు.

సిఎం వ్యాఖ్యలు చేయడం అంబేద్కర్ ను అవమానించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆత్మకూరి బాలస్వామి మాదిగ, భక్తి బాను చందర్ మాదిగ, ఆత్మకూరి ప్రభాకర్ మాదిగ, కేశపాక మహేష్ మాదిగ, రాచమల్ల రమేష్, ఆత్మకూరి సునీల్, కంత్రి నరేష్ మాదిగ పాల్గొన్నారు.



గుజరాత్ పర్యటనలో భాగంగా అహ్మదాబాదుకు 5 కిలోమీటర్ల దూరంలో సబర్మతీ నది ఒడ్డున స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీ నిర్మించుకున్న సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. ఆయనకు పూలమాల వేసి, అక్కడ భద్రపరిచిన వస్తువులను తిలకించారు



తరిగొప్పులలో ముందస్తుగా అరెస్ట్ చేసిన జనగాం జిల్లా బిజెపి నాయకులు జిల్లా ఇన్చార్జి పాపారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ యాదవ్, మండల నాయకులు

# బీజేపీ నాయకులపై దాడి

**నర్మెట ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** మండల కేంద్రంలో బిజెపి నాయకులు బుధవారం రోజు జరిగిన జనగాం జిల్లా బీజేవైఎం నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ నర్మెట మండల అధ్యక్షుడు తర్వాత రాజు నాయక్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి దీక్ష చేస్తున్న ఈ సమయంలో టిఆర్ఎస్ నాయకులు బిజెపి నాయకుల పై దాడి చేసినట్టుగా రాజ్ నాయక్ తెలిపారు. బిజెపి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.



## మడేలేశ్వర ఆలయ చైర్మన్ గా 'పెద్దింటి రాజు'

**జగిత్యాల ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** జగిత్యాల రజక సంఘము ఆధ్వర్యంలో నిర్మించిన మడేలేశ్వర ఆలయం అభివృద్ధిలో భాగంగా ఆలయ చైర్మన్, డైరెక్టర్ల ఎన్నిక గురువారం జరిగింది. స్థానిక మంచినీళ్ల బావి వద్దగల మడేలేశ్వర ఆలయ చైర్మన్ గా పెద్దింటి రాజు ఎన్నిక కాగా డైరెక్టర్లు గా మర్రిపెల్లి రమేష్, మర్రిపెల్లి శ్రీనివాస్, బోరగల్ల దేవరాజ్, బోరగల్ల రవి, కొనారపు గణేష్, గుండారపు రాజేష్, గట్టపెల్లి జానేశ్వర్, బండ పెల్లి గణేష్, మతులాపురం శ్రీనివాస్, బండ పెల్లి రాజులు



ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు రజక కుల పెద్దలు శాలువాలతో అభినందించారు. అనంతరం పలువురు కుల పెద్దలు మాట్లాడుతూ.... ఆలయ అభివృద్ధికి పాటుపడుతూ భక్తుల అన్ని సదుపాయాల కల్పనకై కృషి చేయాలని సూచించారు. తమపై ఎంతో నమ్మకంతో ఎన్నుకొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని అందరి నమ్మకాలను అనుగుణంగా పనిచేస్తామని చైర్మన్ రాజుతోపాటు మిగతా డైరెక్టర్లు అన్నారు.

# సమ్మక్క సారక్క జాతరకు ఎమ్మెల్యే రాజయ్యకు ఆహ్వానం

**వేలేర్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేలేరు మండలం, పీచర సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి సమ్మక్క సారలమ్మ జాతరకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో



మండలపార్టీ అధ్యక్షుడు మరిజే నర్సింగారావు, జిల్లా ఆత్మ చైర్మన్ కీర్తి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ మేక రవీందర్, జాతర కమిటీ చైర్మన్ ఎర్రగొల్ల ఎల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షులు పోలు తిరుపతి, పెద్ది నగేష్ మరియు కొయ్యడ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పుల మండల కేంద్రంలో శుక్ర వారం జనగామలో కెసిఆర్ బహిరంగ సభకు భారీ తరలి రావాలని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జార్జి రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు పిఎసిఎస్ డైరెక్టర్లు తదితరులు



## ములుకనూరు సహకార పరపతి సంఘం ఎన్నికల నగారా

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** సహకార రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ములుకనూర్ సహకార పరపతి సంఘం ఎన్నికలకు నగారా మోగింది. భీమదేవరపల్లి మండలంలోని ములుకనూర్ సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం జిల్లా సహకార, ఎన్నికల అధికారి యం. నీరజ ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలో మొత్తం 15 డైరెక్టర్ స్థానాలు ఉండగా 3, 7, 8, 12, 14 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25 న నామినేషన్లు, 26 న పరిశీలన చేయనున్నారు. 27 న నామినేషన్ల ఉప సంహరణలు, గుర్తుల కేటాయింపులు, ఏకగ్రీవాల ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. మార్చి 11 న సంఘ ప్రధాన కార్యాలయంలో ఉ.6 గం.ల నుండి మధ్యాహ్నం 2 గం.ల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు, గెలుపొందిన వార్డుల ఫలితాలు ప్రకటిస్తారని అన్నారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన సమన్వయ సమావేశం

**జగిత్యాల ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** జగిత్యాల టౌన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై కౌన్సిలర్లు మరియు కాలేజి లెక్చరర్లతో సమన్వయ




సమావేశం నిర్వహించారు. అవగాహన సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో. ఆప్షన్ మెంబర్లు, డిఎస్పీ ప్రకాష్, ఎక్సైజ్ సుపరిండెంట్ శ్రీధర్, సిఐ కిశోర్, ఎక్సైజ్ సిఐ ప్రభాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం హెల్త్ స్కీమ్ సీజీహెచ్ఎస్‌లో చేరండి

**- చేరడానికి చివరి తేది మార్చి 31**

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** ప్రతి ఒక్క బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్ తమ వైద్య సేవలకై సీజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్) ను వినియోగించుకోవాలని బీఎస్ఎన్ఎల్ వీఆర్ఎస్ ఉద్యోగుల స్టేట్ సెక్రటరీ పొట్లకాయల వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు సీజీహెచ్ ఎస్ లో చేరని వారు వెంటనే రాబోవు మార్చి 31 లోగా చేరాలని కోరారు. పెన్షనర్లు, వారి ఫ్యామిలీ మెంబర్స్ కూడ ఈ స్కీమ్‌కు అర్హులని, ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థనే ఇందుకు సంబంధించిన ప్రీమియం చెల్లిస్తుందన్నారు.

## మోడీ జోలికొస్తే ఊరుకునేది లేదు

**సీఎం, మంత్రి దిష్టిబొమ్మల దగ్ధం**

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** ప్రధానమంత్రి నరేంద్రమోడీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బన్సీలాల్ పేట బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. గురువారం బోయిగూడ క్రాస్ రోడ్డుపై సీఎం కేసీఆర్, మంత్రి తలసాని దిష్టిబొమ్మలను దహనం



చేసి, వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నేతగా గుర్తించబడిన ప్రధాని మోడీని దూషిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు గల్లంతావుతాయన్న ఫ్రస్టేషన్ లో టీఆర్ఎస్ నేతలు పిచ్చి కూతలు కూస్తున్నారని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ పార్టీ కో ఆర్డినేటర్ టి. రాజశేఖర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ ఉమేశ్ ఖండేల్వాల్, నాయకులు ఎస్. రాజు, వై. సురేశ్, శివరామకృష్ణ, కుర్మ శంకర్, వై.శ్రీనివాస్, ఎస్.వై. గిరి, శివలింగం, మహేశ్, శ్రీకర్, సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు.

## 10 మంది తహసిల్దార్‌ల బదిలీలు

**జగిత్యాల ఫిబ్రవరి 10 ( ప్రజామంటలు):** జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 10 మంది తహసిల్దార్ లను జిల్లా కలెక్టర్ జి. రవి గురువారం బదిలీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఉదయ్ కుమార్ ను ఇబ్రహీం పట్నం తహసిల్దార్‌గా,కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డి. మధు ను గొల్లపల్లి తహసిల్దార్‌గా రాయికల్ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.మహేశ్వర్ ను మేడిపల్లి తహసిల్దార్ గా, జగిత్యాల రూరల్ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న కె. దిలీప్ నాయక్ ను రాయికల్ తహసిల్దార్‌గా, వెల్గటూర్ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. రాజెందర్‌ను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, గొల్లపల్లి తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న పి. నవీన్ ను జగిత్యాల రూరల్ తహసిల్దార్ గా, మెట్ పల్లి తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. రాజేష్‌ను కోరుట్ల తహసిల్దార్‌గా, మేడిపల్లి తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండి. బషిరుద్దీన్‌ను జగిత్యాల తహససిల్దార్‌గా, ఇబ్రహీం పట్నం తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వి. రమేష్ ను వెల్గటూర్ తహసిల్దార్‌గా, కోరుట్ల తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. సత్యనారాయణ ను మెట్ పల్లి తహసిల్దార్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## టీఆర్ఎస్, బిజెపి పార్టీలు
# కుట్రలకు పాల్పడుతున్నారు

**కథలాపూర్ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** టీఆర్ఎస్, బిజెపి పార్టీలు కుట్రలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. టీఆర్ఎస్, బీజేపీ వైరం అనేది కాంగ్రెస్ ను ప్రజల్లో కనుమరుగు చేయడానికి చేస్తున్న వ్యూహం అని పేర్కొన్నారు. టీఆరెఎస్ బిజెపి ప్రభుత్వాలు ఒకరు భారత రాజ్యాంగంపై మరొకరు తెలంగాణ పై ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోస్తుకుంటూ తెలంగాణ ప్రజలను ఆగం చేస్తున్నారన్నారు. తెలంగాణలో ఇప్పటికే కాంగ్రెస్ పెద్ద ఎత్తున గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్నదని కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా అందుకు తగ్గ కార్యాచరణను ఇప్పటికే రూపొందించుకుంటూ ప్రణాళిక బద్దంగా అడుగులేస్తున్న పరిస్థితి క్రమంలో తెలంగాణ ప్రజలను తప్పుద్రోవ పట్టించడానికే ఇలాంటి కార్యక్రమాలకు టీఆరెఎస్ బిజెపి ప్రభుత్వాలు పూనుకున్నయని ఆరోపించారు. టీఆరెఎస్, బిజెపి ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. భేషరతుగా మోడీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీమ్, పిసిసి అంజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లెడ గంగాధర్, సంజీవ్ రెడ్డి, రాజా రెడ్డి, సంజీవ్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సభ్యత్వ నమోదు చేసుకోండి : ధర్మపురి శ్రీనివాస్



**జనగామ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** ఎఐసిసి,పిసిసి ఆదేశాల మేరకు పొన్నాల లక్ష్మయ్య సూచనల సలహాలతో ప్రతి గ్రామంలో ప్రతి బూతులో, సభ్యత్వ నమోదు కార్య క్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని జనగామ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ అన్నారు.గురువారం జనగామలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తల బలోపేతం చేయడానికి కంకణ బద్ధులై, గ్రామ అధ్యక్షులు, ఎంపీటీసీలు సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, అన్ని విభాగాల నాయకులు %డ% ఎన్రోల్లర్స్ తో కాంగ్రెస్ పార్టీ లో చేర్పించి పూర్వ వైభవం తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు.

ఒక కాంగ్రెస్ కార్యకర్త ఏడు రకాల ఓటు హక్కులను వినియోగించుకునే అవకాశం ఉందని, అవి ఒక ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్నిక కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఓటు హక్కులను వినియోగించుకుంటారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపే తానికి సోనియా రాహుల్, ప్రియాంకల నాయకత్వంలో కంకణ బద్ధులై పని చేద్దామని అన్నారు. సభ్యత్వంతో జీవిత భీమా ఉంటుందన్న విషయం గమనించాలని ధర్మపురి శ్రీనివాస్ కోరారు.

## ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఉద్యోగులు

**నల్ల బ్యాడ్జీలతో నిరసనలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి10:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అనుచిత వ్యాఖ్యలపై గురువారం టీజీవో, టీఎన్జీవో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణకు ద్రోహం చేసే నాయకులను సహించేది లేదంటూ నగరంలోని కార్యాలయ భవనాల ఎదుట పెద్ద ఎత్తున నినదించారు. దాదాపు 60 సంవత్సరాలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నామని, రాష్ట్ర ఏర్పాటును కించపరిచినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని, వెంటనే ప్రధాని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీజీవో అధ్యక్షురాలు, టీఈజేఏసీ సెక్రెటరీ జనరల్ మమత డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగులంతా నాటి ఉద్యమ నేత సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమించామని, అలాగే నేడు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం 30శాతం పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులకు అనుకూలంగా ఉంటే.. ఆదాయపన్ను పరిమితిని పెంచకుండా కేంద్రం ఉద్యోగులపై వివక్ష చూపుతుందని, తక్షణమే ఆదాయ పన్ను పరిమితిని 10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ప్రతాప్, టీజీవో, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణాయాదవ్, ముజిబ్, సుజాత, సబిత, సాయిపూర్ణచంద రావు, సులోన, లక్ష్మీపతిరెడ్డి, డీ బాలకుమార్, ప్రవీణ్ కుమార్, డీ వినయ్ కుమార్, ఎన్ వినోద్ కుమార్, రెడ్డప్పా, ఆనంద్, కిశోర్, ఏ ఆనంద్ కుమార్, ఆర్ సుబ్బారావు పాల్గొన్నారు.

## నేటినుంచి పాతగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాలు

**స్వర్ణతాపడానికి 11లక్షల విరాళం ఇచ్చిన బాంబినో**

**యాదాద్రి భువనగిరి,ఫిబ్రవరి10:** యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా ఉన్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 వరకు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఉదయం 9గంటలకు స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.గీత గురువారం తెలిపారు. 12న ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, 13న రాత్రి 8 గంటలకు ఎదుర్కోలు, 14న రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15న రాత్రి 8 గంటలకు రథోత్సవం, 17న ఉదయం 9 గంటలకు స్వామివారి శతఘటాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలకు పరిసమాప్తి పలుకుతామని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె వివరించారు. ఇదిలావుంటే యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య విమానగోపురం స్వర్ణతాపడానికి విరాళాల సేకరణ కొనసాగుతున్నది. స్వర్ణతాపడం పనులకు భక్తుల నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పిలుపు మేరకు పలువురు దాతలు స్పందిస్తున్నారు. బాంబినో పాస్తా ఫుడ్ ఇండస్ట్రీ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ ఎం సుబ్రమణ్యం రూ. 11,00,000ల చెక్కును ఆలయ ఈవో ఎన్ గీతకు అందజేశారు. ఈ సందర్భంగా ఎం సుబ్రమణ్యంకు ఆలయ పండితులు స్వామివారి దర్శనం కల్పించి, ఆశీర్వచనాలు అందించారు.

# కొత్త జిల్లాలో సమస్యల తిష్ట

**కనీస రహదారికి నోచుకోని పల్లెలు**

**అనేక గ్రామాల్లో మంచినీటి సౌకర్యం సున్నా**

**కుమ్రంభీం,ఫిబ్రవరి10:** జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాళ్లతో నిండిన బాటలతో నడక సాగిస్తూ నానా పాట్లు పడుతున్నారు. అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ ఈ జిల్లాలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి. అనేక ఆ గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ దానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఆయా గూడాల్లోని గ్రామాల్లో ఒక్కగానొక్క బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రామీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. కుమ్రంబీమ్ జిల్లాలోని 15 మండలాల పరిధిలో 486 గ్రామాలకు నేటికీ రహదారుల లేక ప్రజలు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. తిర్యాణి, వాంకిడి, బెజ్జూర్, కాగజ్‌నగర్ మండలాల్లో దారులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారు లేని గ్రామాలు 486 ఉంటే ఇక చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుషు లుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వాంకిడి మండలంలోని గ్రామాలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ విద్యుత్తు వెలుగులకు నోచుకో లేదు. కంకర గూడ, టొక్కిగూడ, ఉర్వేతగూడ, ఎల్లానగర్, కాతిగూడ, దోబి పటాత్, సాయిల్‌గూడ గ్రామాల ప్రజలు కిరోసిన్ దీపాల వెలుగుతోనే సహజీవనం చేస్తున్నారు. కెరమెరి,తిర్యాణి మండలాల్లో అనేక గ్రామాల ప్రజలు చీకట్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

## మత్తుపదార్థాలపై కళాజాత ప్రదర్శన

**'అప్స' ఆధ్వర్యంలో బస్తీల్లో అవగాహన**

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** మద్యపానం, డ్రగ్స్, గంజాయి సేవనంతో కలుగు అనార్థాలపై అప్స సంస్థ నిర్వహకులు బస్తీల్లో ప్రజలకు అవగాహన



కల్పించారు. రాంగోపాల్ పేట డివిజన్ లోని విక్టోరియా రాణిగంజ్, వెంగళరావు నగర్, బేగంపేట డివిజన్ లోని ఎల్ బీ ఎస్ నగర్, పాటిగడ్డ బస్తీల వాసులకు మద్య పానం, మత్తు పదార్థాలు, గంజాయి లతో కలుగు నష్టాలు, ఆరోగ్యంపై ప్రభావాలపై విజయ ఆర్ట్స్ కు చెందిన కళాకారులు కళాజాత ప్రదర్శన, నాటికలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరు తమ భాద్యతగా ప్రభుత్వానికి తమ సహకారం అందించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో అప్స కోఆర్డినేటర్ ఎం.బస్వరాజు, మొబిలైజర్ ఎన్.శోభ, బస్తీ వార్డు మెంబర్ లావణ్య, అంగన్ వాడీ టీచర్ రమ, కానిస్టేబుల్స్ మల్లేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత, కేసు నమోదు: ఎస్సై సుధాకర్

**చిగురుమామిడి ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** గురువారం తెల్లవారుజామున రామంచ వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు అని సమాచారం మేరకు చిగురుమామిడి ఎస్సై డి. సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళు రాజశేఖర్, అహ్మద్ పాషా, హెూంగార్డు లు సమ్మయ్య, భిక్షపతి కలిసి ఉదయం ఐదు గంటలకు రామంచ వెళ్లి అక్కడ అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లు



సీజ్ చేయడం జరిగింది. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు రామంచ గ్రామనికి చెందిన పైసా వీరయ్య, ములుపల నర్సింహ, కస్తూరి మంగయ్య, రంగు సంపత్, అలుకుంట యాదగిరి, గుర్తించి వారిపై కేసు నమోదు చేసి ఐదు ట్రాక్టర్ల ను సీజ్ చేయడం జరిగింది. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని, ఎంతటివారలైన ఉపేక్షించబోమని చిగురుమామిడి ఎస్సై డి. సుధాకర్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా సమాచారం సేకరించిన కానిస్టేబుల్ లను ఎసై అభినందించారు.

## మొక్కలు నాటి ఘనంగా జన్మదిన వేడుకలు

**జనగామ ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పెంబర్తి గ్రామానికి చెందిన అయిలా సోమ బ్రహ్మచారి (పెంబర్తి విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షులు) పుట్టిన రోజు సందర్భంగా ఇంటి ముందు పెంబర్తి బర్త్ డే ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్న నాటి మిత్రులతో కలిసి మొక్కలు నాటి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.



అనంతరం ఫౌండేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు అయిలా సోమనర్సింహ చారి, అధ్యక్షుడు గుండా రాజు, మిత్రులు ఎల్లయ్య చారి, శ్రీహరి, ఉగ్రసేనారెడ్డి, కృష్ణమూర్తి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సూర్యోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. అలాగే జనగామలోని రాజ రాజేశ్వరి సేవా సధన్ నందు వృద్దులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా వ్యాలీలో నెలకొల్పిన భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

## దళిత బంధు కాదు, టిఆర్ఎస్ బంధు

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 10 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలం గోధుర్ గ్రామంలో భారతీయ జనతాపార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది, రాజ్యాంగాన్ని అవమానించిన కేసీఆర్ ను రాష్ట్రం నుండి భారతదేశం నుండి తరిమికొట్టాలి, దళితుల ఓట్లతో గద్దెనెక్కిన కేసీఆర్ దళితులకు చేసింది ఏమి లేదని, దళిత బంధు పేరు పెట్టి వాళ్ల పార్టీ కార్యకర్తలకు ఇవ్వడం, దళితులను మోసం చేస్తున్నారు. కేసీఆర్ 'ఇది దళిత బంధు కాదు టిఆర్ఎస్ బంధు' అని మండల అధ్యక్షులు బట్టు జకరయ్య తెలిపారు. ఇట్టి కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు. మరియు మండల దళిత మోర్చా అధ్యక్షులు తెలుకంటి గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శిలు బండి గోపాల్, సుంచు రణదీర్, ఉపాధ్యక్షులు వై. బాలు, ఉడుత రాజు, మండల కార్యదర్శి చెరుకు రాజు, సీనియర్ నాయకులు గణేష్, చంద్రయ్య, సోమా సీరీస్, తెరపల్లి రాజు,



బండి శశికుమార్, అరిగెల శ్రీనివాస్ గడ్డం పవన్, ఐటి సెల్ ఇంచార్జి అక్కపల్లి జలందర్ తదితరులు పాల్గొన్నారు.



# అల్లుతో నటిస్తా...

## - గంగూబాయ్ కతియావార్

బాలీవుడ్ భామ అలియా భట్ 'గంగూబాయి కతియావాడి' ప్రమోషన్‌లో బిజీగా ఉంది. ఈ సినిమా ట్రైలర్‌కు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ, ప్రశంసలు లభిస్తున్నాయి. ఎక్కువ మంది ప్రజలు థియేటర్లకు వచ్చేలా చూసేందుకు 'గంగూబాయి కతియావాడి'ని అలియా తనవంతు ప్రయత్నం చేస్తోంది. అయితే తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కోసం అలియా భట్ పేరు మార్చుకుంది. 'పుష్ప' మూవీని చూసి అలియా భట్ ఫ్యామిలీ మొత్తం బన్నీకి అభిమానులు అయిపోయారట. దీంతో 'పుష్ప'రాజ్‌పై మనసు పారేసుకున్న ఈ బాలీవుడ్ భామ ఇప్పుడు ఆయనతో కలిసి నటించడానికి ఉవ్విళ్లూరుతోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అలియా ప్రైమ్ వీడియోలో అల్లు అర్జున్ 'పుష్ప'ను చూశానని, టాలీవుడ్ ఐకాన్ స్టార్‌కి పెద్ద అభిమానిని అయ్యానని పేర్కొంది. 'నా కుటుంబం మొత్తం 'పుష్ప'ను చూసి అల్లు అర్జున్‌కి అభిమానులుగా మారారు. వారు నన్ను బన్నీతో కలిసి ఎప్పుడు నటిస్తావు అని అడుగుతున్నారు. అంతేకాదు ఇంట్లో వారు నన్ను ఆలు అని పిలుస్తున్నారు. ఆలు అల్లుతో కలిసి ఎప్పుడు నటిస్తావు అని అడుగుతున్నారు. ఆయనతో కలిసి పని చేసే అవకాశం వస్తే చాలా సంతోషిస్తానని ఆలియా భట్ చెప్పింది.అల్లు అర్జున్‌తో నటించే అవకాశం ఆలియా భట్‌కి ఎప్పుడు వస్తుందో చూడాలి. ప్రస్తుతం అలియా భట్ 'ఆర్ఆర్ఆర్'తో పాటు ఎన్టీఆర్ నెక్ట్స్ మూవీలోనూ నటిస్తోంది.

# ఆర్సీ-15 షూటింగ్ షెడ్యూల్‌లో మార్పులు

### 13 నుంచి ప్రారంభం అవుతుందని సమాచారం



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఆర్సీ 15' చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. దిల్ రాజు బృందం ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో ఒక షెడ్యూల్ ప్లాన్ చేసారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఇక ఈ షెడ్యూల్ 10 నుండి ప్రారంభమయి.. ఫిబ్రవరి 25 వరకు జరుగుతుందని వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు ప్లాన్ మారినట్టు సమాచారం. ముందు ప్లాన్ చేసుకున్నట్టుగా ఈ షెడ్యూల్ షూటింగ్ జరగట్లేదని టాక్ వినిపిస్తోంది. ప్పటికే ప్లాన్ చేసిన ఈ షెడ్యూల్‌ను ఫిబ్రవరి 13 నుంచి స్టార్ట్ చేయబోతున్నారట. దీనికి కారణం హీరో రామ్ చరణ్ అని తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం ముంబైలో ఉన్నారట. దాంతో షూటింగ్ షెడ్యూల్ తేదీని మార్చారని తాజా సమాచారం. కాగా, ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ.. సునీల్, అంజలి, నవీన్ చంద్ర, జయరామ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని టాలీవుడ్ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా, ఎస్ఎస్ తమన్ సంగీతం

## సర్కార్ వారి పాటను పూర్తిచేసే పనిలో మహేశ్ బాబు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు ప్రస్తుతం సర్కారువారి పాట సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. గీతా గోవిందం ఫేం పరుశురాం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇప్పటికే చిత్ర బృందం విడుదల చేసిన ప్రచార చిత్రాలు, బర్త్‌డే బ్లాస్టర్ అంటూ విడుదల చేసిన ప్రోమో ప్రేక్షకులలో భారీ అంచనాలను పెంచుతున్నాయి. ఎస్ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ పాటను ప్రేమికులరోజు సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. ఈ క్రమంలో పాటకు సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో కీర్తిసురేష్ పై మహేష్ బాబు తలవాల్చిన ఫోటోతో పాటు కళావతి సాంగ్ ఆన్ ఫిబ్రవరి14..అంటూ పోస్టర్‌లో ఉంది. మైత్రి మూవీ మేకర్స్, 14రీల్స్, సంస్థలతో కలిసి మహేష్‌బాబు స్వీయ నిర్మాణంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మే 12న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారట.



## మంజిమా మోహన్‌తో లవ్‌లో పడ్డ గౌతమ్ కార్తీక్

తమిళ నటుడు గౌతమ్ కార్తీక్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఈ యంగ్ యాక్టర్ కుర్ర హీరోయిన్ మంజిమా మోహన్‌తో లవ్‌లో ఉన్నాడట. వీళ్లిద్దరూ తమ ప్రేమను పెళ్లిపీటల వరకు తీసుకెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2019లో దేవరత్తమ్ సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించిందట. అప్పటినుంచి వాళ్లిద్దరూ చెన్నైలో కలిసే ఉంటున్నారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఇరు కుటుంబాలు వీరి ప్రేమకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పెళ్లి చేసుకోవడానికి రెడీ అయ్యారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వాలంటైన్స్ డే రోజు వారి ప్రేమను అఫీషియల్‌గా వెల్లడించే అవకాశాలు కూడా లేకపోలేదంటున్నారు. ఇదిలా ఉంటే అలనాటి హీరో నవరస నయగన్ కార్తీక్ తనయుడే గౌతమ్ కార్తీక్. ప్రస్తుతం అతడు యుత సతం, పాటు తల సినిమాలు చేస్తున్నాడు. మంజిమ మోహన్.. 'సాహసం శ్వాసగా సాగిపో' సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం ఆమె నటించిన ఎఫ్ఐఆర్ మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాలో విష్ణు విశాల్, రైజా విల్సన్, రెబా మోనికా తదితరులు నటించారు.



# మహేశ్‌బాబు వివాహానికి 17 ఏళ్లు

### విషెస్ చెప్పిన సినీ ప్రముఖులు

టాలీవుడ్ సూపర్ క్యూట్ కపుల్స్ లిస్ట్‌లో ముందు వరుసలో ఉండేది మహేశ్ బాబు, నమ్రత శిరోద్కర్. 'వంశీ' సినిమా షూటింగ్ సమయంలో ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ముందుగా తమ ప్రేమ విషయం మహేశ్..



తండ్రి కృష్ణకు తెలిపారు. ఆయన నమ్రతా కుటుంబంతో మాట్లాడి వారి అంగీకారంతోనే ఇద్దరి పెళ్లి జరిపించారు. ఇ ఇద్దరూ దంపతులై గురువారం 17 ఏళ్ళు పూర్తయింది. ఆ దంపతులకు రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు. తనయుడు గౌతమ్ కృష్ణ ఇప్పుడు తండ్రి కన్నా హైట్ అయ్యాడు. తనయ సితార ఇప్పుడు సోషల్ మీడియా స్టార్. స్నేహితురాలు ఆద్యతో కలిసి ఓ యూట్యూబ్ ఛానల్ కూడా ఓపెన్ చేసింది. తల్లి పెంపకంలో మంచి క్రమశిక్షణను అలవరుచుకుంది సితూ పాప. తండ్రికి ఆమె గారాల పట్టి. మహేశ్ బాబు తన ఫ్యామిలీకి ఎప్పుడూ మంచి ప్రధాన్యతనిస్తారు. గ్యాప్ దొరికినప్పుడల్లా భార్యా పిల్లలతో కలిసి సమ్మర్ వెకేషన్స్‌కు వెళు తుంటారు. పిల్లల బాధ్యతను పూర్తిగా నమ్రతనే చూసు కుంటుందని మహేశ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. తమకు సంబంధించిన ప్రతీ విషయాన్ని నమ్రత సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానుల్ని ఖుషీ చేస్తూంటుంది. ఈ రోజు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మహేశ్, తను కలిసి దిగిన ఫోటోస్ తో ఓ వీడియో చేసి.. ఇన్ స్టాలో షేర్ చేసింది నమ్రత. దీనికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్యూట్ కపుల్స్‌కి పలువురు సినీ ప్రముఖులు, దర్శక, నిర్మాతలు శుభాకాంక్షలు తెలిపారు.చిరంజీవి, ప్రభాస్, కొరటాల శివ, నిరంజన్ రెడ్డి, అలీ, పోసాని కృష్ణమురళి వంటి ప్రముఖులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశం అయ్యేందుకు విజయవాడ వెళ్లిన విషయం తెలిసిందే కదా! ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి తాడేపల్లి చేరుకున్న విమానంలోనే పుష్పగుచ్ఛం ఇచ్చి మహేశ్‌కు విషెస్ తెలియజేశారు చిరంజీవి. 'మహేశ్‌బాబు, నమ్రత ఇద్దరికీ వెడ్డింగ్ యానివర్సరీ శుభాకాంక్షలు. మీరిద్దరూ జీవితాంతం చిరునవ్వులతో సుఖసంతోషంగా ఉండాలని కోరుకుంటూ చిరు ట్వీట్ చేశారు.

## క్రికెటర్ శ్రీశాంత్‌తో నటిస్తున్న సామ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత, సౌత్ లేడీ సూపర్ స్టార్ నయతారా లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం కాతువాకుల రెండు కాదల్. ఇందులో తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి కథానాయకుడు. నయన్ ప్రియుడు విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకుంది. లాస్ట్ షెడ్యూల్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటున్న ఈ చిత్రంలో ఒకప్పటి టిమిండియా ఆటగాడు కీ రోల్ పోషిస్తున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. టిమిండియా బౌలర్, నటుడు శ్రీశాంత్ ఈ చిత్రంలో నటిస్తున్నట్లు చిత్రం బృందం వెల్లడించింది. అంతేకాదు ఈ సినిమాని అతడి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. ఇందులో శ్రీశాంత్ మహ్మద్ మోబీ అనే పాత్రలో కనిపించనున్నాడట. కాగా ఇప్పటికే ఈ మూవీ నుంచి సమంత, నయనతార, విజయ్ సేతుపతిల లుక్ విడుదల కాగా వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో శ్రీశాంత్, సమంత సరసన పలు సన్నివేశాల్లో కనిపించనున్నట్లు జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. కాగా ఇప్పటికే శ్రీశాంత్ ఓ మూవీతో హీరోగా పరిచమైన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో గుర్తింపు పొందలేదు. ఈ క్రమంలో మరోసారి నటుడిగా నిరూపించుకోవాలని ఎదురు చూస్తున్న శ్రీశాంత్‌కు ఇది మంచి అవకాశమని చెప్పుకోవాలి. దీనితో పాటు శ్రీశాంత్ మరో రెండు సినిమాల్లో నటింస్తున్నట్లు తెలుస్తోంది.




## శివకార్తికేయ తెలుగు సినిమా ప్రారంభం



తమిళ హీరో శివ కార్తికేయన్ నటిస్తున్న మొదటి తెలుగు సినిమా ప్రారంభ మయింది. తెలుగు, తమిళ భాషాలలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'జాతారత్నాలు' ఫేమ్ అనుదీప్ కె.వి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పీ సురేష్ ప్రొడక్షన్స్, శాంతి టాకీస్ పతాకాలపై నారాయణ్ దాస్ కె నారంగ్ పుస్కూర్ రామ్మోహన్ రావు డి. సురేష్ బాబు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చెన్నైలోని కారకూడిలో ఈ సినిమాను లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నిర్మాతలైన డి. సురేష్ బాబు, పుస్కూర్ రామ్మోహన్ రావు, దర్శకుడు అనుదీప్ కె.వి, హీరో శివ కార్తికేయన్, సత్యరాజ్, చిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఎంటర్ టైమ్ మెంట్ జర్నీ మొదలైంది. తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం కారైకుడిలో అధికారికంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభించబడింది. నేటి నుంచే రెగ్యులర్ షూటింగ్ మొదలైంది' అంటూ మేకర్స్ చిత్రానికి సంబధించిన లాంఛింగ్ ఫొటోలను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

## మహేశ్‌బాబు అత్తపాత్రలో రాధ?

సూపర్ స్టార్ మహేశ్ బాబు, సూపర్ డైరెక్టర్ త్రివిక్రమ్ కలయికలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.



రీసెంట్ గా పూజా కార్యక్రమాలతో లాంఛ్ అయిన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ సినిమాకి సంబంధించిన ఓ రూమర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. మహేశ్ బాబు తల్లిగా ఒకప్పటి గ్లామర్ హీరోయిన్ రాధ నటించబోతున్నట్టు వార్తలొస్తున్నాయి. ఒకప్పటి అందాల హీరోయిన్స్‌కు త్రివిక్రమ్ తన సినిమాల్లో తల్లి. అత్త వేషాలివ్వడం ఆచారంగా వస్తోంది. ఇప్పటికే 'నదియా, టబు, ఖుష్బూ' లాంటి నిన్నటి తరం హీరోయిన్స్ ఆయన సినిమాల్లో ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పుడు వారి లిస్ట్ లోకి రాధ కూడా చేరనుండడం హాట్ టాపిక్ అయింది. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్‌లతోనే కాకుండా.. అప్పటి అగ్ర హీరోలైన యన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ,శోభన్ బాబు, కృష్ణంరాజు చిత్రాల్లో కూడా రాధ గ్లామర్ ఒలికించిన సంగతి తెలిసిందే. నైంటీస్ లోనే సినిమాలకి గుడ్ బై చెప్పిన రాధ.. మహేశ్ చిత్రంతో టాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇవ్వనుండడం విశేషం. తన ఇద్దరు కూతుళ్ళు హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఆమె రీ ఎంట్రీ ఇవ్వనుండడం మరో విశేషం. మరి ఈ వార్తల్లో నిజానిజాలేంటో చూడాలి.

## తలైవార్ 169 .. సూపర్ స్టారా మజాకానా?

169 సూపర్ స్టారా మజాకానా? ఆయన ఇస్టయిలే వేరు. అతడు ఏం చేసినా అది ఓ ఇస్టయిల్. అతడు కూచుంటే.. అతడు నిలుచుంటే.. తల ఆడిస్తే... అలా రేబాన్ ని ఫింగర్స్ పై నిలబెడితే .. ఆ స్టైలే వేరు. కేవలం బాడీ లాంగ్వేజ్ తోనే రజనీ కాంత్ ఫ్యాన్స్ ని స్పెల్ బౌండ్ చేసేస్తుంటారు. మీరు ఇలానే ఎందుకు చేస్తారు? అని అడిగేస్తే అంతే ఓపెన్‌గా అసలు విషయం కూడా



చెప్పేస్తారు రజనీ. అసలు నేను అంత అందగాడిని కాను. ఏదో ఒక స్టైల్ తో పెర్ఫామెన్స్ తో కవర్ చేయాలి! అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బాహాటంగానే ఉన్న విషయం చెప్పడానికి వెనకాడలేదు. శివాజీ రావు కాస్తా సూపర్ స్టార్ రజనీకాంత్ గా అవతరించారు. తాజాగా ఆయన తలైవార్ 169 షూటింగ్ కోసం రెడీ అవుతున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రానికి దర్శకుడు కాగా.. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్ లో నెల్సన్ - అనిరుధ్ ఎంతో స్టైలిష్ గా సూట్ లు ధరించి ఫోజు లివ్వగా.. తలైవార్ రజనీకాంత్ ఇస్టయిల్ ముందు ఇంకెవరూ నిలబడలేరు అన్నంతగా విజువల్స్‌ని తీర్చిదిద్దిన తీరు ఆసక్తిని కలిగించింది.

## డిజిటల్ ప్రీమియర్‌కి సిద్ధమైన బంగార్రాజు!



తండ్రీకొడుకులు అక్కినేని నాగార్జున, నాగ చైతన్య కలిసి బంగార్రాజుతో ఘన విజయం సాధించారు. సంక్రాంతికి విడుదలైన ఈ ఫాంటసీ డ్రామా OTT ప్లాట్ ఫారమ్‌లోకి ప్రవేశిస్తోంది. కళ్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 18, 2022న ZEE 5 ప్లాట్‌ఫారమ్‌లో డిజిటల్‌గా అరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉందని దాదాపు ధృవీకరించబడింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. అనూప్ రూబెన్స్ సంగీతం, యువరాజ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాలో రమ్యకృష్ణ, కృతి శెట్టి కథానాయికలుగా నటించారు. డిజిటల్ ప్రీమియర్‌గా వస్తున్న ఈ చిత్రం ఏ తరహా రెస్పాన్స్‌ను రాబడుతుందో చూడాలి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com